

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు

## ప్రపంచ పెద్దన్నగా.. మళ్లీ ట్రంప్



- అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం
- స్వింగ్ రాష్ట్రాలన్నింటిలో జయభేరి

11



## టార్గెట్.. థౌజండ్ క్రోర్స్!

2

- ఏపీ డ్రోన్ పాలసీకి కేబినెట్ మోదం..
- పెట్టుబడుల సాధనే లక్ష్యంగా పాలసీల రూపకల్పన
- అదే బాటలో ఏపీ డేటా సెంటర్ 4.0
- సెమీకండక్టర్ అండ్ డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీ 4.0
- ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ (నిషేధం) బిల్లు ముసాయిదాకు ఓకే
- 8352 చ.కి.మీమేర సీఆర్డీఏ పునరుద్ధరణకు గ్రీన్‌సిగ్నల్
- జ్యుడీషియల్ ఆఫీసర్ల పదవీ విరమణ వయస్సు 61కి పెంపు
- కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పునరుద్ధరణ
- పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు
- కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి కొలుసు పార్థసారధి

## డోనాల్డ్ ట్రంపునకు చంద్రబాబు అభినందనలు

అమరావతి (చైతన్యరథం): అమెరికా అధ్యక్ష ఎన్నికలలో విజయం సాధించిన డోనాల్డ్ ట్రంపును ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. ఈమేరకు 'ఎక్స్'లో ట్వీట్ చేస్తూ.. 'అమెరికా అధ్యక్ష ఎన్నికలలో విజయం సాధించిన ట్రంప్ అభినందనీయుడు. అమెరికాను మరింత ముందుకు నడిపించే ఆశయ సిద్ధిలో ట్రంపు విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నా. ట్రంప్ మొదటి పదవీకాలం ఇండో-యుఎస్ భాగస్వామ్యాన్ని గణనీయంగా బలోపేతం చేసింది. భారత ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సారథ్యంలో ఇండో-యూఎస్ బంధం మరింత బలోపేతమవుతుందని, పరస్పర సహకారం పెంపొందించుకుంటాయని విశ్వసిస్తున్నాను' అని పేర్కొన్నారు.



## మీ కష్టం.. మాకు ఆదర్శం

- మంత్రి లోకేష్‌కు సహచర మంత్రుల అభినందనలు
- అమెరికాలో పెట్టుబడుల జైత్రయాత్ర విజయవంతంపై హర్షం

4

## సహజ పరిధికి సీఆర్డీఏ



- 8352 చ.కి.మీ మేర విస్తరణకు నిర్ణయం
- 2014-19నాటి ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానం అమలు
- కాలేజీ యాజమాన్యాల ఖాతాలకు నేరుగా జమ
- పిఠాపురం సీహెచ్‌సీ వంద పడకలకు విస్తరణ
- అమరావతికి ఔటర్ రింగురోడ్డు నిర్మాణానికి ఓకే
- కేబినెట్ నిర్ణయాలు ప్రకటించిన మంత్రి కొలుసు

2

## నేనున్నా..!!

- విద్యార్థులకు మంత్రి లోకేష్ భరోసా
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రతి ట్వీట్

- వివరాలు 5లో..

## అధునాతన విధానాలతో మద్యం నాణ్యత పరీక్షలు

- వినియోగదారుల ఆరోగ్యమే ధ్యేయంగా పరీక్షలకు నూతన ప్రామాణికాలు
- ప్రాంతీయ ఎక్సైజ్ లేబొరేటరీల్లో అందుబాటులో గ్యాస్ క్రోమోటోగ్రఫీ విధానం

- వివరాలు 4లో..

- మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి

## తిరుమల పవిత్రత పరిరక్షణే తొలి ప్రాధాన్యత



- టీటీడీ నూతన చైర్మన్ బీఆర్ నాయుడు స్పష్టీకరణ
- భక్తుల మెరుగైన సేవలకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని వినతి
- బ్రహ్మోత్సవాలు భేషుగ్గా నిర్వహించారని అభినందనలు

4

## కొలువు తీరిన టీటీడీ కొత్త చైర్మన్

శ్రీవారి కొండపై బీఆర్ నాయుడు ప్రమాణస్వీకారం

6



## పారదర్శకతే శాసన వ్యవస్థకు ప్రాణం

- కామన్వెల్త్ పార్లమెంటరీ మహాసభల్లో ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

4

## వర్రా రవీంద్రారెడ్డి తప్పించుకున్నారా.. తప్పించారా?

- పోలీసుల తీరుపై ప్రభుత్వం సీరియస్
- కడప ఎస్పీ బదిలీ, సీఐ సస్పెన్షన్

5

## అరబిందో భారీ దందా

- 108 అంబులెన్సుల నిర్వహణలో కుంభకోణం
- పక్కదారి పట్టిన ప్రజల సొత్తు
- విజయసాయిరెడ్డి వియ్యంకుడి సంస్థకి దోచిపెట్టిన జగన్ రెడ్డి
- ఎమ్మెల్యే సోమిరెడ్డి ధ్వజం

6



## నేతలు కాదు రాబందులు

- పరిహారం ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసిన వైసీపీ నేతలు
- భర్త చనిపోతే భార్యకు తెలియకుండా భూమి కబ్జా
- టీడీపీ కేంద్ర కార్యాలయానికి తరలివచ్చిన అర్జీదారులు

7



# ఏపీ డ్రోన్ పాలసీకి కేబినెట్ మోదం..

- పెట్టుబడుల సాధనేలక్ష్యంగా పాలసీల రూపకల్పన
- అదే బాటలో ఏపీ డేటా సెంటర్ 4.0
- సెమీకండక్టర్ అండ్ డిస్ప్లే ఫ్యాబ్ పాలసీ 4.0
- ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ (నిషేధం) బిల్లు ముసాయిదాకు ఓకే
- 8352 చ.కి.మీమేర సీఆర్డీఏ పునరుద్ధరణకు గ్రీన్‌సిగ్నల్
- జ్యుడీషియల్ ఆఫీసర్ల పదవీ విరమణ వయస్సు 61కి పెంపు
- కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పునరుద్ధరణ
- పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు
- కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి కొలుసు పార్థసారథి



అమరావతి (చైతన్య రథం): మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల సెక్టార్ లక్ష్య సాధనకు వీలుగా ఏపీ డ్రోన్ పాలసీ 4.0కు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. డ్రోన్ వినియోగాభిరుచిని పెంచేలా.. అత్యవసర, ఇతర సేవలను వేగవంతం చేసేలా రాష్ట్ర డ్రోన్ కార్పొరేషన్ రూపొందించిన పాలసీకి మంత్రిమండలి ఓకే చెప్పింది. రాష్ట్రాన్ని డ్రోన్ హబ్‌గా మార్చే దిశగా ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తుండటం తెలిసిందే. అందులో భాగంగా కర్నూలులో డ్రోన్ డెవల్‌పమెంట్ సెంటర్ ఏర్పాటుకూ కేబినెట్ నిర్ణయించింది. ఫ్లగ్ అండ్ ప్లే విధానంలో డ్రోన్ డెవల్‌పమెంట్, ట్రైనింగ్, తయారీ కేంద్రాన్ని కర్నూలులో ఏర్పాటు చేస్తారు. ఈ పాలసీతో రాష్ట్రంలో వందకుపైగా డ్రోన్ తయారీ కంపెనీలు ఏర్పాటవుతాయని, దాదాపు 20 డ్రోన్ పైలట్ శిక్షణ కేంద్రాలు, 50నైపుణ్యాభివృద్ధి సంస్థలను స్థాపించే అవకాశం ఉంటుందని ప్రభుత్వంఅంచనా వేస్తోంది. డ్రోన్ సెక్టార్‌లో రూ.1,000కోట్ల పెట్టుబడులు, రూ.3,000 కోట్ల రాబడి వస్తుందన్నది ప్రభుత్వ అంచనా. డ్రోన్ పాలసీతో ప్రత్యక్షంగా 15 వేలమందికి, పరోక్షంగా 25 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో ఐదో ఈ-క్యాబినెట్ సమావేశం జరిగింది. సమావేశంలో పలు కీలక అంశాలను విస్తృతంగా చర్చించిన కేబినెట్.. కీలక నిర్ణయాలు తీసుకుంది. కేబినెట్ నిర్ణయాలను సచివాలయం నాల్గవ భవనం ప్రచార విభాగంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ డేటా సెంటర్ పాలసీ 4.0ని మంత్రిమండలి ఆమోదించింది. ఈపాలసీ ద్వారా నియమితకాలంలో ఆంధ్రప్రదేశ్‌లో 200 మెగా వాట్ల అదనపు డేటా సెంటర్ సామర్థ్యాన్ని చేర్చడమే లక్ష్యం. కృత్రిమ మేధస్సు సామర్థ్యాలతో కూడిన అధునాతన డేటా సెంటర్ల నుండి పెట్టుబడులను ఆకర్షించడానికి మరియు పెద్దస్థాయి డేటా ఎంబసీలు మరియు డేటా సెంటర్ పార్కులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చడంపై దృష్టి సారించడం జరుగుతుందని మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. ప్రతిపాదిత డేటా సెంటర్ విధానం (4.0) 2024-29 అధునిక డేటా సెంటర్ల నుండి ఆర్థిక పెట్టుబడులను ఆశిస్తున్నట్టు వివరించారు.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్స్ విభాగంలోనే ఆంధ్రప్రదేశ్ సెమీకండక్టర్ అండ్ డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీ 4.0కి మంత్రిమండలి ఆమోదం తెలిపింది. సెమీకండక్టర్ల రంగంలో పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా ప్రభుత్వం తొలిసారి ఈ పాలసీని తీసుకొస్తోంది. 2024-29 మధ్యకాలంలో అమలయ్యేలా దీన్ని రూపొందించారు. కేంద్రం 50శాతం రాయితీని దశలవారీగా అందచేస్తుంది. దీనికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 30 శాతం వరకూ పలు రకాల రాయితీలను అందిస్తుంది. అమెరికా, యూరప్ దేశాలకు సంబంధించిన పలు సెమీకండక్టర్ల తయారీ పరిశ్రమలు గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్రల్లో ఏర్పాటయ్యాయి. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌ను కూడా తీర్చిదిద్దేందుకు ఈ పాలసీ ఎంతగానో ఉపయోగపడుతుందని మంత్రి కొలుసు వివరించారు. ఆయా రాష్ట్రాల్లో పెట్టుబడులుపెట్టే సంస్థలకు కేంద్ర ప్రభుత్వం కూడా ప్రోత్సాహకాలిస్తోంది. దాదాపు 30 శాతం రాయితీలను రాష్ట ప్రభుత్వం ఇవ్వడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో.. చిప్‌లు, సెమీకండక్టర్ల తయారీ రంగంలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఈ కొత్త విధనాన్ని తీసుకొచ్చింది. డ్రోన్ పాలసీ మరియు సెమీకండక్టర్ అండ్ డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు ఇవ్వనుంది.

ఏపీ ల్యాండ్ గాబింగ్ (నిషేధం) చట్టం -1982ని రద్దు చేస్తూ ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ (నిషేధం) బిల్లు-2024 అమలుకు సంబంధించిన ముసాయిదా బిల్లు ఆమోదం కోసం చేసిన ప్రతిపాదనకు రాష్ట్రమంత్రి మండలి ఆమోదం తెలిపింది. ల్యాందు గ్రాబింగుకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించేలా ఈ చట్టాన్ని రూపొందించినట్టు మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. 10 నుండి 14 ఏళ్లపాటు శిక్ష, గ్రాబ్ చేయబడిన ల్యాండ్ విలువతోపాటు నష్టపరిహారాన్ని వసూలు చేసేలా నిబంధనలు పొందుపర్చారు. గుజరాత్, కర్ణాటలోని చట్టాలను కూడా పరిగణనలోకి తీసుకుంటూ ఈ చట్టాన్ని రూపొందించడం జరిగింది. ప్రభుత్వ భూముల రక్షణకు పదునైన చట్టం అమల్లోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కసరత్తులో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వ హయాంలో లక్షల ఎకరాలు అన్యాక్రాంతమైనట్టు కూటమి ప్రభుత్వం గుర్తించిందని మంత్రి కొలుసు పేర్కొన్నారు.

పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖలో 2014-19 మధ్యకాలంలో జరిగిన అభివృద్ధి పనులకు గత ప్రభుత్వం చెల్లింపులు చేయకపోగా.. వారిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించి ఆర్థికంగా, మానసికంగా వేధించడంతో వారందరూ కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో.. 4.45 లక్షల పనులకు సంబంధించి గుత్తేదారులకు రూ.331 కోట్లు చెల్లించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. సదరు కాంట్రాక్టర్లకు 12శాతం వడ్డీ కూడా ఇవ్వాలన్న విషయంపై ప్రభుత్వం పరిశీలన చేస్తోందన్నారు.

ఆర్థిక శాఖలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ (రెగ్యులేషన్ ఆఫ్ ఏజ్ ఆఫ్ సూపర్ యాన్యుయేషన్) చట్టం -1984 పరిధిలోకి వచ్చే జ్యుడీషియల్ ఆఫీసర్ల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 61 సంవత్సరాలకు 01.11.2024తేదీ నుండి పెంచడానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 3(1)ని సవరించడానికి రూపొందించిన ముసాయిదా బిల్లుకు రాష్ట్రమంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ వస్తువులు మరియు సేవల పన్నుచట్టం, 2017ను సవరిస్తూ.. 2024 ముసాయిదా బిల్లుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. అలాగే, ఏపీ ఎక్సైజ్ విభాగంలో రూపొందించిన మూడు ముసాయిదా బిల్లులకు కేబినెట్ ఆమోదం తెలుపుతూ రాష్ట్ర శాసనసభ ముందుంచేందుకు అనుమతించింది. నాసిరకం మద్యంతో గత ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే.. మా ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నూతన మద్యం విధానం అమలు చేయడం జరుగుతోందని మంత్రి పార్థసారథి వివరించారు. చిత్తూరు జిల్లా కుప్పం ప్రధాన కేంద్రంగా కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పునరుద్ధరణకు రాష్ట్రమంత్రి మండలి ఆమోదం తెలిపింది. అలాగే, పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధికై పిఠాపురం ప్రధాన కేంద్రంగా పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకూ కేబినెట్ ఆమోదం తెలిపింది.

# సహజ పరిధికి సీఆర్డీఏ

- 8352 చ.కి.మీ మేర విస్తరణకు నిర్ణయం
- 2014-19నాటి ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానం అమలు
- కాలేజీ యాజమాన్యాల ఖాతాలకు నేరుగా జమ
- పిఠాపురం సీహెచ్‌సీ వంద పడకలకు విస్తరణ
- అమరావతికి ఔటర్ రింగురోడ్డు నిర్మాణానికి ఓకే
- కేబినెట్ నిర్ణయాలు ప్రకటించిన మంత్రి కొలుసు




అమరావతి (చైతన్య రథం): సీఆర్‌డీఏ సహజ పరిధి అయిన 8,352.69 చ.కి.లను పునరుద్ధరించేందుకు మంతిమండలి ఆమోదం తెలిపిందని సమాచార మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. సత్తెనపల్లి మున్సిపాలిటీ సహా పల్నాడు జిల్లాలోని 92 గ్రామాలను, బాపట్ల జిల్లాలోని 62 గ్రామాలను సీఆర్డీఏ పరిధిలోకి తెచ్చేందుకు మంత్రిమండలి ఆమోదించిందన్నారు. ఇటీవల రాజధాని నిర్మాణ పనులను సీఎం చంద్రబాబు పునఃప్రారంభించారని, ఉద్దండరాయునిపాలెం వద్ద సీఆర్డీఏ భవనం పనులు ప్రారంభమైనట్టు మంత్రి పేర్కొన్నారు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో ఐదో ఈ-క్యాబినెట్ సమావేశం జరిగింది. సమావేశంలో పలు కీలక అంశాలను విస్తృతంగా చర్చించిన కేబినెట్.. కీలక నిర్ణయాలు తీసుకుంది. కేబినెట్ నిర్ణయాలను సచివాలయం నాల్గవ భవనం ప్రచార విభాగంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు.

కోర్సు పూర్తైన వెంటనే విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేయాలనే లక్ష్యంతో పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల (ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్) చెల్లింపు విధానాన్ని మార్చేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ నూతన విధానం ద్వారా 2024-25 విద్యాసంవత్సరం నుండి ఎస్సీలు కాకుండా ఇతర విద్యార్థులందరికీ సంబంధించి పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను (ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్) సంబంధిత కళాశాలల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమచేయడం జరుగుతుంది. గత ప్రభుత్వంలో అమలు చేసిన విధానానికి ప్రస్తుత ప్రభుత్వం స్వస్తి పలికిందని మంత్రి తెలిపారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను.. విద్యార్థులకు సంబంధం లేకుండా యాజమాన్యాల అకౌంట్‌లలోకి జమచేయడం జరిగేది. గత ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా కాలేజీల యాజమాన్యాలు నిర్దేశిత గడువుకు ఫీజుల్ని చెల్లించాల్సిందేనని విద్యార్థులపై ఒత్తిడి తీసుకొచ్చేవారు. ఈ క్రమంలో కొంతమంది విద్యార్థులు ఫీజులు కట్టలేక పరీక్షలు కూడా రాయలేదనే విమర్శలు ఉన్నాయి. ఈ ఇబ్బందులన్నింటినీ గమనించిన ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కాలేజీ యాజమాన్యాల అకౌంట్‌లలోకే జమ చేయాలని నిర్ణయం తీసుకుందని మంత్రి వివరించారు.

కాకినాడ జిల్లా పిఠాపురంలోని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రిగా రూ.38.32 కోట్లతో అప్‌గ్రేడ్ చేయడంతో పాటు 66 నూతన పోస్టులను మంజూరు చేసేందుకు చేసిన ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. దీనిద్వారా 5-6 లక్షల మందికి ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడం జరుగుతుంది.

ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ డ్యూటీ (సవరణ) చట్టం, 2020లోని సెక్షన్ 3ని సవరించడానికి ముసాయిదా బిల్లు ఆమోదం కోసం చేసిన ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. 1990లో 6 పైసలున్న ఎలక్ట్రిసిటీ డ్యూటీని 2020లో రూ.1.00 కు పెంచడం జరిగింది. అయితే ప్రైవేటు పెట్టుబడిదారులు ఈ ఎలక్ట్రిసిటీ డ్యూటీ నుండి తప్పించుకునేందుకు కోర్టులకు వెళ్లడం జరిగింది. ఈక్రమంలో ఎలక్ట్రిసిటీ డ్యూటీ బకాయిలను వసూలు చేసేందుకు ఈ ముసాయిదా బిల్లును రూపొందించడం జరిగిందని మంత్రి వివరించారు.

ఏపీఐఐసీ యొక్క రాష్ట్రస్థాయి కేటాయింపు కమిటీ సిఫారసుల ప్రకారం 311 పారిశ్రామిక భూమి కేటాయింపులకై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి మంత్రిమండలి ఆమోదం తెలిపింది. దీనిద్వారా పరిశ్రమల యూనిట్లకు భూమిని కేటాయించే విధానాన్ని పునరుద్ధరించేందుకు మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది.


అవుటర్ రింగ్ రోడ్, అమరావతి సిటీ మరియు విజయవాడ తూర్పు బైపాస్ మంజూరు కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి మంత్రిమండలి ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతికి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)ను 189 కిలోమీటర్ల పొడవున నిర్మించాలన్నది ప్రతిపాదన. ఎక్స్‌ప్రెస్ వేలు, ఎకనమిక్ కారిడార్లు, జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు, పారిశ్రామిక పార్కులను ఓఆర్ఆర్‌కు అనుసంధానించనుండడంతో రాజధానికే ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. సీఆర్డీఏ పరిధిలోకి సత్తెనపల్లి మున్సిపాలిటీ, పల్నాడు జిల్లాలోని 92 గ్రామాలు, బాపట్ల జిల్లాలోని 62 గ్రామాలను తీసుకురావడం జరుగుతుంది. ఓఆర్ఆర్ పరిధిలోకి.. బెంగళూరు-విజయవాడ కారిడార్, విజయవాడ-నాగపూర్ కారిడార్, ఎన్‌హెచ్-16, ఎన్‌హెచ్-65, ఎన్‌హెచ్-30, ఎన్‌హెచ్-216హెచ్, ఎన్‌హెచ్-544, ఎన్‌హెచ్-541జీ వంటివి అనుసంధానమవుతాయని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు.

ముప్పైయేళ్ల చంద్రన్న స్మార్ట్ అండ్ హార్డ్‌వర్క్

# అభివృద్ధి.. సంక్షేమం.. సామాజిక న్యాయానికి పట్టం


సెప్టెంబరు 1, 1995న శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు ముఖ్యమంత్రిగా తొలుత బాధ్యతలు చేపట్టి సెప్టెంబరు 1, 2024 నాటికి 30వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంలో.. మహోజ్వల విజయాలు కొన్ని.

## విజనరీ లీడర్ మన చంద్రన్న




## స్వర్ణ చతుర్భుజి - రోడ్లకు శ్రీకారం

1. విదేశాల్లో మాదిరిగా భారత దేశంలోనూ విశాలమైన జాతీయ రహదారులను నిర్మించే ప్రతిపాదనను చంద్రబాబు గారు తెచ్చారు.
2. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో రోడ్లు వేయవచ్చనే ప్రతిపాదన మాజీ ప్రధాని వాజ్‌పేయి గారికి ఇచ్చారు.
3. ఆ ఫలితంగా కేంద్రం 'స్వర్ణ చతుర్భుజి' పేరుతో తొలిగా నెల్లూరు-చెన్నై జాతీయ రహదారి అభివృద్ధి చేయడం జరిగింది. ఇది దేశం నలు దిక్కులా జాతీయ రహదారుల విస్తరణకు ప్రేరణ ఇచ్చింది.
4. ప్రాజెక్ట్ సకాలంలో పూర్తయ్యేందుకు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (NHAI)తో కలిసి పనిచేసిన చంద్రబాబు ప్రభుత్వం(1995-2004).



చైతన్యరథం

# పారదర్శకతే శాసన వ్యవస్థకు ప్రాణం

## - కామన్వెల్త్ పార్లమెంటరీ మహాసభల్లో ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు



సిడ్నీ (ఆస్ట్రేలియా): శాసన వ్యవస్థకు పారదర్శకతే ప్రాణమని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు ఉద్ఘాటించారు. అదే.. న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలకు భిన్నంగా శాసనవ్యవస్థను నిలుపుతోందన్నారు. రాజ్యాంగం, సభా నియమాలు.. శాసన వ్యవస్థ పనితీరులో దాపరికానికి తావు లేకుండా చేశాయన్నారు. ప్రజలు చట్టసభల కార్యకలాపాలను పరిశీలించి, తమ అభిప్రాయాలు వెల్లడించేందుకు అవకాశం కల్పించడం పారదర్శకతకు పునాదిగా నిలుస్తోందన్నారు. ఈ పారదర్శకతను పెంపొందించేందుకు ఆంధ్రప్రదేశ్ చట్టసభలు ప్రత్యక్ష ప్రసారం నిర్వహిస్తున్నాయని స్పీకర్ తెలిపారు.

ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో 67వ కామన్వెల్త్ పార్లమెంటరీ మహాసభల్లో "ఉత్తమ విధానాల అమలు ద్వారా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ప్రతిష్ట' అనే అంశంపై చర్చలో పాల్గొంటూ, శాసనసభ కమిటీ పనితీరుకు మరింత పారదర్శకత అవసరమని అయ్యన్నపాత్రుడు అభిప్రాయపడ్డారు. కమిటీ సమావేశాల వివరాలను ప్రజలకు చేరవేసేందుకు అన్ని పక్షాలు చర్చ ద్వారా ఏకాభిప్రాయం సాధించాల్సిన అవసరం ఉందన్నారు.

శాసనసభ ప్రధాన కర్తవ్యం చట్టాలను రూపొందించడం అని, అయితే చట్టాలపై సమగ్ర చర్చకు తగినంత సమయం దొరక్కపోవడం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. ప్రజల రోజువారీ సమస్యల పరిష్కారంలో శాసనసభ్యులు నిమగ్న మవడం వల్ల చట్టాలపై పరిశోధనకు తగిన సమయం దొరకడం లేదని స్పీకర్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలు, ఇతర ప్రభుత్వ సంస్థలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తే శాసనసభ్యులకు భారం తగ్గుతుందని చెప్పారు.

ప్రశ్నల సమయం, శూన్యకాలం, ప్రత్యేక ప్రస్తావనలు వంటి సాధనాలు ఉన్నప్పటికీ, శాసనసభ పనిదినాలు తక్కువగా ఉండటం వల్ల ఆశించిన ఫలితాలు సాధించడం కష్టమవుతోందన్నారు. అందుకే, ఏడాదిలో కనీసం ఎన్ని రోజులు చట్టసభలు సమావేశం కావాలన్నది రాజ్యాంగ సవరణ ద్వారా నిర్ధారించాలని ఆయన సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఏడాదికి కనీసం 70 రోజులు సమావేశమవడం మంచిదని అయ్యన్నపాత్రుడు అభిప్రాయపడ్డారు.

అంతేకాకుండా, సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థలో విస్తృతంగా ప్రవేశపెట్టబోతున్నామని, త్వరలోనే కాగితరహిత కార్యకలాపాల కోసం చర్యలు తీసుకుంటున్నామని స్పీకర్ తెలిపారు. ప్రపంచంలోని ఉత్తమ విధానాలను స్వీకరించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు..

# మీ కష్టం.. మాకు ఆదర్శం

- మంత్రి లోకేష్‌కు సహచర మంత్రుల అభినందనలు
- అమెరికాలో పెట్టుబడుల జైత్రయాత్ర విజయవంతంపై హర్షం



అమరావతి (చైతన్యరథం): అమెరికాలో వారం రోజులపాటు పెట్టుబడుల జైత్ర యాత్రను విజయవంతంగా పూర్తిచేసి అమరావతి విచ్చేసిన మంత్రి లోకేష్‌ను సహచర మంత్రులు బుధవారం ఉండవల్లి నివాసంలో కలిసి అభినందించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు, పరిశ్రమదారుల్లో నమ్మకం కలిగించడానికి మీరు పడుతున్న కష్టం తమకందరికీ ఆదర్శమని అన్నారు. మీరు చేస్తున్న ప్రయత్నాలు రాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా నిలబెట్టడంలో గేమ్ ఛేంజర్ కాగలవని వారు కొనియాడారు.

నారా లోకేష్ అమెరికా పర్యటనలో వరుస భేటీలతో తీరికలేకుండా గడిపారు. దాదాపు 100కంపెనీల ప్రతి నిధులతో సమావేశమై ఏపీలో పెట్టు బడులకు గల అవకాశాలనువారికి వివరించారు. ఏపీలో ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని, పరి శ్రమల స్థాపనకు అత్యంత అనువైన వాతావరణం ఉందని వారికి తెలియ జేశారు. భారత్‌లోనే బెస్ట్ ఇండస్ట్రియల్ పాలసీని ఏపీలో అమలు చేస్తున్నామని వారికి మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. పెట్టుబడులకు మంత్రి లోకేష్ ఆహ్వానం పట్ల పలు కంపెనీలు సానుకూలంగా స్పందించాయి.

## తిరుమల పవిత్రత పరిరక్షణే

# తొలి ప్రాధాన్యత



- టీటీడీ నూతన ఛైర్మన్ బీఆర్ నాయుడు స్పష్టీకరణ
- భక్తుల మెరుగైన సేవలకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని పిలుపు
- బ్రహ్మోత్సవాలు భేషుగ్గా నిర్వహించారని అభినందనలు
- సీనియర్ అధికారులతో పరిచయ కార్యక్రమం

తిరుమల (చైతన్యరథం): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన హిందూ పుణ్యక్షేత్రమైన తిరుమల పవిత్రతను కాపాడుకోవడమే ప్రస్తుత టీటీడీ ధర్మకర్తల మండలి ప్రాధాన్యత అని టీటీడీ నూతన ధర్మ కర్తల మండలిఛైర్మన్ బి.ఆర్.నాయుడు స్పష్టంచేశారు. టీటీడీ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం బుధవారం సాయంత్రం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఆయన తొలిసారిగా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవారి భక్తులకు సేవ చేసుకునే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి ధన్యవాదాలు తెలిపారు. తాను చిన్నప్పటి నుండే ప్రతి సంవత్సరం శ్రీవేంకటేశ్వర స్వామిని కాలినడకన వచ్చి దర్శించుకునేవాడినని, ప్రస్తుతం తిరుమలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు సేవ చేసుకునే అరుదైన అవకాశాన్ని శ్రీవారు ప్రసాదించడం పూర్వజన్మ సుకృతమన్నారు. భక్తులకు సేవ చేసేందుకు మీడియాతో సహా ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని కోరారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గత నెలలో బ్రహ్మోత్సవాలను ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా విజయవంతంగా నిర్వహించిన అధికారులకు అభినందనలు తెలిపారు. తిరుమల పవిత్రతను కాపాడేందుకు, భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు అధికారులు సమష్టి కృషిని కొనసాగించాలని ఆకాంక్షించారు.

### సీనియర్ అధికారులతో పరిచయ సమావేశం

అంతకుముందు టీటీడీ సీనియర్ అధికారులందరితో ఛైర్మన్ పరిచయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలపై ఈవో జె.శ్యామలరావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ సమర్పించారు. తిరుమల ఆలయం, స్థానిక దేవాలయాలు, అన్నప్రసాదం, విజిలెన్స్, ఆరోగ్యం, రవాణా, ఐటీ, గోశాల, ఉద్యానవనం, అటవీశాఖ, విద్యాసంస్థలు ప్రాముఖ్య తను వివరించారు. ఆసుపత్రులు, మెడికల్, పీఆర్ వింగ్, రిసెప్షన్, కళ్యాణకట్ట, హిందూ ధార్మిక ప్రాజెక్టులు, యాత్రికుల దర్శనం, వసతి, ఇతర సౌకర్యాలను చూసుకోవడంతో పాటు తమ నిబద్ధత తో సంస్థ ఖ్యాతిని అన్ని స్థాయిల్లో ముందుకు తీసుకెళ్లడంలో ఉద్యోగులు అంకితభావంతో పని చేస్తున్నారని ఈవో తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీటీడీ అడిషనల్ ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, డీఎల్ఓ వరప్రసాదరావు, సీఈ సత్యనారాయణ, పలువురు బోర్డు సభ్యులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అధునాతన విధానాలతో

# మద్యం నాణ్యత పరీక్షలు

- వినియోగదారుల ఆరోగ్యమే ధ్యేయంగా పరీక్షలకు నూతన ప్రామాణికాలు
- ప్రాంతీయ ఎక్సైజ్ లేబొరేటరీల్లో అందుబాటులో గ్యాస్ క్రోమోటోగ్రఫీ విధానం
- బ్లైండ్ పరీక్షకు 9, ఇఎన్‌ప పరీక్షలకు 13 పరామితులు
- మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి



అమరావతి (చైతన్యరథం): వినియోగదారులకు నాణ్యమైన మద్యాన్ని అందించాలన్న లక్ష్యం మేరకు ప్రభుత్వం నూతనంగా విభిన్న ప్రామాణికాల మేరకు పరీక్షలు నిర్వహిస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఇప్పటి వరకు కేవలం ఎక్స్ ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ (ఇఎన్ఎ) నమూనాలను పరీక్షించి ఆరు రకాల ప్రామాణికాల మేరకు పరిశీలించేవారని ఇప్పుడు ఈ విధానాన్ని పూర్తిగా ఆధునీకరించామన్నారు. ప్రాంతీయ ఎక్సైజ్ లాబొరేటరీల్లో ఆరు ప్రాథమిక ప్రామాణికాల మేరకు ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ (ఇఎన్ఎ) నమూనాలను ఇథైల్ ఆల్కహాల్, ఆసిడిటీ, ఆల్డిహైడ్స్, మిథనాల్, నీటిలో కలయిక పరీక్షలు మాత్రమే నిర్వహించేవారన్నారు. మరో వైపు ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ రూపంలో ఉత్పత్తి అయ్యే విస్కీ, బ్రాందీ, వోడ్కా, జిన్, రమ్‌లకు సంబంధించి బాటిలింగ్ చేయడానికి ముందు మిశ్రమ నమూనాల్లో ఆల్కహాల్ శాతం (స్ట్రెంత్) మాత్రమే లెక్కిస్తున్నారు. ఇలా కేవలం ఒక పరామితి మేర మాత్రమే ఇప్పటి వరకు పరీక్షలు నిర్వహిస్తుండగా, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పుడు ఈ విధానాల్లో సమూల మార్పులు తీసుకువచ్చారు. ఆధునిక సాంకేతికత ఆధారంగా ముందడుగు వేస్తున్నారు.

ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్, బ్లైండ్ (బాటిలింగ్‌కు ముందు సిద్ధం చేసిన నమూనా)లను పరీక్షించడానికి గ్యాస్ క్రోమోటోగ్రఫీ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని కొల్లు రవీంద్ర వివరించారు. ఇది సాంకేతికంగా ఉన్నతమైన విధానంగా గుర్తింపు పొందింది. వైజాగ్, గుంటూరు, చిత్తూరు, కర్నూలు, కాకినాడల్లోని రీజనల్ ప్రొబెషనరీ, ఎక్సైజ్ లేబొరేటరీల ద్వారా బాటిలింగ్‌కు ముందు అన్ని రకాల మద్యాన్ని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్), ఫుడ్‌సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా ఉండేలా వివిధ రకాల పరీక్షల కోసం కొత్త పరామితులు నిర్ణయించామని మంత్రి కొల్లు రవీంద్ర వివరించారు. అత్యాధునిక విధానాలను అనుసరించి ఇఎన్ఏను పరీక్షించడానికి 13 పరామితులు సిద్ధం చేసారు. బ్లైండ్ (విస్కీ, బ్రాందీ, వోడ్కా జిన్) పరీక్షలకు తొమ్మిది పరామితులు నిర్ణయించారు. నూతన ప్రామాణికాల అమలు ఫలితంగా కెమికల్ రియాక్షన్ వంటి పరిస్థితులను అడ్డుకోగలుగుతామన్నారు. ఇది మద్యం వినియోగదారుల ఆరోగ్య సంరక్షణకు ఉపకరిస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.

చైతన్యరథం

# ఆంగ్లో -ఇండియన్ల సమస్యల పరిష్కారానికి కృషి





- రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ హామీ
- మంత్రి ఫరూక్‌ను కలిసిన ఏడు రాష్ట్రాల ప్రతినిధుల బృందం

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలోని ఆంగ్లో ఇండియన్ కుటుంబాల సంక్షేమానికి, వారు ఎదుర్కొంటున్న వివిధరకాల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ హామీ ఇచ్చారు. బుధవారం వెలగపూడి సచివాలయంలోని మంత్రి పేషీలో ఆంగ్లో-ఇండియన్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి బృందం (ఏపీ, తెలంగాణ సహా 7 రాష్ట్రాల బృందం) మంత్రి ఫరూక్‌ను కలిసింది. ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డా.ఎ.రాయ్ రోజారియో, ప్రధాన కార్యదర్శి ఎస్.పాట్రిక్ డూలాండ్, సభ్యులు బార్బరా ఆన్ బెర్రీ, అమలా వాలెస్, నిక్సన్ డి'క్రూజ్, కొరెట్టా అలియాస్ కవిత, కోరిన్ న్యూబెగింగ్‌లు మంత్రి ఫరూక్, మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి కే హర్షవర్ధన్, ఏపీ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండి డాక్టర్ ఏ.శేఖర్‌ల దృష్టికి ఆంగ్లో ఇండియన్లు ఎదుర్కొంటున్న సమస్యలను తీసుకొచ్చారు. రాష్ట్రంలో దాదాపు లక్ష దాకా ఆంగ్లో ఇండియన్ జనాభా ఉందని, ఎటువంటి అభివృద్ధికి, సంక్షేమానికి నోచుకోక వీరు పడుతున్న ఇబ్బందులను ఫెడరేషన్ ప్రతినిధులు వివరించారు. ఆంగ్లో ఇండియన్స్‌కు చట్టసభల్లో ప్రాతినిధ్యానికి కేటాయింపులు, ఉన్నత విద్య, ఉపాధి కోసం రిజర్వేషన్ అమలు, బ్యాంకుల నుంచి రుణాలు అందేలా సరళీకృతమైన విధానాలు అమలు చేయాలని కోరారు. పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ఆంగ్లో ఇండియన్లకు దక్కాల్సిన సంక్షేమ ఫలాలు, నామినేటెడ్ పదవుల కేటాయింపులో వివిధ సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పించే చర్యలను గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. ఆంగ్లో ఇండియన్ కుటుంబాల సమస్యలను పరిష్కరించేందుకు, వారి అభ్యున్నతికి అవసరమైన అన్ని చర్యలను సీఎం నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వం ద్వారా చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఫెడరేషన్ ప్రతినిధుల బృందానికి హామీ ఇచ్చారు. అనంతరం సిక్కుల సంఘం ప్రతినిధులు కూడా మంత్రి ఫరూక్‌ను కలిశారు. ఏపీలో సిక్కుల ఆర్థిక స్వావలంబన, సంక్షేమం కోసం ప్రత్యేకంగా సిక్కుల ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుచేసి అండగా నిలవాలని మంత్రిని కోరారు. సిక్కు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుపైకూడా సీఎం దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామని మంత్రి ఫరూక్ హామీ ఇచ్చారు.

## నేనున్నా..!!



- విద్యార్థులకు మంత్రి లోకేష్ భరోసా
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రతి ట్వీట్

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలపరిష్కారానికి విద్యా మంత్రిగా కట్టుబడిఉన్నానని నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఒక మంత్రిగా తానెంత చేయగలనో అంతా చేస్తానని భరోసానిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను పంచుకోవడానికి చాలామంది విద్యార్థులులోకేష్‌ను ట్యాగ్‌చేశారు.దీనిపై ప్రతి ట్వీట్ చేస్తూ.. 2024-25 విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నేరుగా కళాశాలల బ్యాంకు ఖాతాలకు జమవుతుంది. గత ప్రభుత్వం చెల్లించకుండా వదిలేసిన రూ.3.5వేల కోట్లనూ దశలవారీగా క్లియర్ చేస్తాం. ఈలోగా విద్యార్థులకు సమస్య తలెత్త కుండా.. సర్టిఫికెట్లు మరియు ఇతర అవసరమైన పత్రాల జారీతో సహా విద్యార్థుల సమస్యలను ముందుగానే పరిష్కరించడానికి ప్రభుత్వం కళాశాలలతో కలిసి పని చేస్తుంది' అంటూ లోకేష్ ట్వీట్‌చేశారు. ఆంధ్ర ప్రదేశ్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించడానికి కట్టుబడి ఉన్నాను'అని లోకేష్ ప్రతిట్వీట్ చేశారు.

## వర్రా రవీంద్రారెడ్డి తప్పించుకున్నారా.. తప్పించారా?

- ప్రభుత్వం సీరియస్
- కడప ఎస్పీ బదిలీ, సీఐ సస్పెన్షన్

అమరావతి (చైతన్యరథం): కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజుపై బదిలీ వేటు పడింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వైసీపీ నేత వర్రా రవీంద్రారెడ్డి పోలీసుల కళ్లుగప్పి తప్పించుకున్న వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రభుత్వం ఈ మేరకు చర్యలు తీసుకుంది. రవీంద్రారెడ్డి పెట్టిన అసభ్యకర పోస్టులపై ఫిర్యాదులు వచ్చినా, చర్యలు తీసుకోకపోవడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించింది. మరోవైపు కడప జిల్లాలో మరో సీఐని కూడా ప్రభుత్వం సస్పెండ్ చేసింది. రవీంద్రరెడ్డిని అరెస్టు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని పోలీసులపై ఫిర్యాదులు వచ్చాయి. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేష్, అనితపై సామాజిక మాధ్యమాల్లో రవీంద్రరెడ్డి అసభ్యకర పోస్టులు పెట్టిన సంగతి తెలిసిందే..

వైసీపీ ఎంపీ అవినాష్ రెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఉన్న రవీంద్ర.. వైసీపీ హయాంలోనూ, ప్రభుత్వం మారిన తరువాత కూడా టీడీపీ నేతలపై తీవ్ర పదజాలంతో సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా.. అదే తీరు కొనసాగించాడు. వర్రా రవీంద్రారెడ్డిపై చాలా కేసులు కేసులు ఉన్నాయి. ఇదే విషయంపై రెండు రోజుల క్రితం ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. ఈ పరిస్థితుల్లో మంగళవారం సాయంత్రం కడప పోలీసులు రవీంద్రను అదుపులోకి తీసుకొని తాలూకా పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. పులివెందులకు చెందిన ఓ వైసీపీ నాయకుడి సూచనల మేరకు 41ఏ నోటీసులు ఇచ్చి వదిలేశారు.

### తీవ్ర దుమారం

నోటీసులు ఇచ్చి వదిలేసిన సమయంలో రవీంద్రరెడ్డిని మరో కేసులో అదుపులోకి తీసుకోవడానికి రాజంపేట పోలీసులు మంగళవారం రాత్రి కడప తాలూకా పోలీస్ స్టేషన్ దగ్గర సిద్ధంగా ఉన్నారు. కానీ, కడప పోలీసులు అతడిని రాజంపేట పోలీసులకు అప్పగించకుండా నేరుగా బయటకు పంపించేశారు. రాజంపేట పోలీసుల కళ్లుగప్పి రవీంద్ర అక్కడి నుంచి పారిపోయాడు. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డి పోలీసుల నుంచి తప్పించుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేవలం టీడీపీ, జనసేన నేతలనే కాకుండా జగన్ తల్లి విజయమ్మ, చెల్లెళ్లు షర్మిల, సునీతను కూడా రవీంద్రారెడ్డి దూషించారు. రంకులు అంటగట్టారు. ఆయన సోషల్ మీడియా పేజీలన్నీ జుగుప్సాకరంగా ఉంటాయి. అలాంటి వ్యక్తిని పోలీసులే తప్పించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం

సామాజిక మాధ్యమాల్లో అత్యంత అసభ్యకరంగా పోస్టులు పెట్టిన రవీంద్రరెడ్డిని పోలీసులు వదిలేయడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. కర్నూలు రేంజ్ డీఐజీ కోయా ప్రవీణ్‌ను వెంటనే కడప వెళ్లి.. కేసు వివరాలు ఆరా తీయాలని ఆదేశించింది. ఈ మేరకు డీఐజీ ప్రవీణ్ కడప వెళ్లి, ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో భేటీ అయ్యారు. రవీంద్ర ఎలా తప్పించుకున్నాడు.. ఎక్కడ పొరపాటు జరిగిందన్నదానిపై ఆరా తీశారు. ఇదే సమయంలో రవీంద్ర కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వైసీపీ నేత ఒకరి కనుసన్నల్లో రవీంద్ర ఉండటంతో అతడికి కూడా పోలీసులు ఫోన్ చేసి, ఆరా తీసినట్లు సమాచారం.

ఐదేళ్లపాటు చంద్రబాబు, లోకేష్, పవన్ లక్ష్యంగా పోస్టులు పెట్టిన రవీంద్ర... పోలీసులకు చిక్కితే... తమదైన శైలిలో విచారించాల్సిన పోలీసులు కేవలం నోటీసులు ఇచ్చి పంపించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గురువారం లోపు రవీంద్రను అదుపులోకి తీసుకుంటామని పోలీసులు చెబుతున్నారు. ఇతడిపై పులివెందుల, కడప, మంగళగిరి, రాజంపేటతోపాటు హైదరాబాద్‌లోనూ కేసులున్నాయి. దాదాపు 30 కేసుల వరకు నమోదై ఉంటాయని పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. ఈ ఘటనపై ఇంటెలిజెన్స్ నివేదికను కూడా రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లు సమాచారం

## అమెరికా-భారత్ సంబంధాల్లో కొత్త శకానికి నాంది

- ట్రంప్ విజయంపై బాలకృష్ణ హర్షం
- కొత్త అధ్యక్షుడికి హృదయపూర్వక అభినందనలు

అమరావతి (చైతన్యరథం): అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రెండోసారి ఘన విజయం సాధించిన రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌నకు హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేశారు. ఈ విజయం అమెరికా-భారత్ సంబంధాల్లో కొత్త శకానికి నాందిగా నిలుస్తుందన్నారు. అన్‌స్టాపబుల్‌గా ట్రంప్ విజయం సాధించిన విధంగా భారత్-అమెరికాల మధ్య కూడా అన్ స్టాపబుల్‌గా స్నేహపూర్వక సంబంధాలు కొనసాగాలని, అభివృద్ధిలో పరస్పర సహకారం అందించాలని కోరుతున్నానన్నారు. అమెరికాలో ఉన్న తెలుగు ప్రజల సంక్షేమం, అభివృద్ధి, రక్షణ, భద్రతకు సహకరించాలని ట్రంప్‌ను బాలకృష్ణ కోరారు.

## సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం వైసీపీ నేతకు 14 రోజుల రిమాండ్

గుంటూరు (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తప్పుడు పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ వెంకట రామిరెడ్డికి గుంటూరు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఎన్డీయే ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, టీడీపీ అగ్రనేతలపై సోషల్ మీడియాలో అభ్యంతరక పోస్టులు పెట్టాడంటూ అతడిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రభుత్వం, మంత్రులపై దుష్ప్రచారాలు చేస్తున్నాడంటూ అభియోగాలు మోపారు. ఈ మేరకు వెంకటరామిరెడ్డిని బుధవారం నగరంపాలెం పోలీసులు కోర్టు ఎదుట హాజరు పరిచారు. దీంతో వైసీపీ నేతకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

## నందిగం సురేష్‌కు హైకోర్టులో చుక్కెదురు

### బెయిల్ పిటిషన్ కొట్టివేత

అమరావతి (చైతన్యరథం): వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు ఏపీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. మరియమ్మ అనే మహిళ హత్య కేసులో బెయిల్ కోరుతూ పిటిషన్ వేసిన ఆయనకు నిరాశ ఎదురయింది. ఆయనకు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. బెయిల్ పిటిషన్ ను కొట్టివేసింది. కేసు వివరాల్లోకి వెళితే... 2020లో తుళ్లూరు మండలం వెలగపూడిలో రెండు సామాజికవర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇరు వర్గాలు రాళ్లు రువ్వుకున్నాయి. ఈ ఘటనలో వెలగపూడికి చెందిన మరియమ్మ మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తుళ్లూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదయింది. ఈ కేసులో నందిగం సురేష్‌ను పోలీసులు 78వ నిందితుడిగా చేర్చారు. తనకు బెయిల్ మంజూరు చేయాలని ఆయన తొలుత గుంటూరు కోర్టును ఆశ్రయించారు. అయితే, ఆయన అభ్యర్థనను గుంటూరు కోర్టు తిరస్కరించింది. దీంతో, ఆయన హైకోర్టులో పిటిషన్ వేశారు. పిటిషన్ ను విచారించిన హైకోర్టు బుధవారం బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది.

# కొలువు తీరిన టీటీడీ కొత్త చైర్మన్

## - శ్రీవారి కొండపై బీఆర్ నాయుడు ప్రమాణస్వీకారం







తిరుమల : తిరుమల తిరుపతి దేవస్థానాల ధర్మకర్తల మండలి కొత్త చైర్మన్‌గా బీఆర్ నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమం సాంప్రదాయ బద్ధంగా జరిగింది. బుధవారం ఉదయం తిరుమల శ్రీవారి ఆలయంలో నాయుడు పదవీ ప్రమాణం చేశారు. ముందుగా తిరుమల క్షేత్ర సాంప్రదాయం పాటిస్తూ బీఆర్ నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ భూ వరాహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుండి ఆలయానికి వచ్చారు.

ముందుగా ఆలయ మహాద్వారం వద్ద టీటీడీ అధికారులు నాయుడుకు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో బంగారు వాకిలి వద్ద టీటీడీ ఈవో శ్రీ జె శ్యామలరావు బీఆర్ నాయుడుతో కొత్త చైర్మన్‌గా ప్రమాణం చేయించారు. అనంతరం ఆయన శ్రీవారిని దర్శించుకోగా రంగ నాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేశారు. అంతకు ముందు ఆయనను ఈవో సాదరంగా శాలువ కప్పి సన్మానించారు. స్వామివారి ప్రసాదం, చిత్రపటం, టీటీడీ డైరీలు, క్యాలెండర్లు అందించారు.

అనంతరం ధర్మకర్తల మండలి సభ్యులుగా దేవాదాయశాఖ కార్యదర్శి సత్య నారాయణ, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, జంగా కృష్ణమూర్తి, మల్లెల రాజశేఖర్ గౌడ్, జాస్తి పూర్ణ సాంబశివరావు, ఎం.ఎస్.రాజు, నర్సిరెడ్డి, బూంగునూరు మహేందర్ రెడ్డి, అనుగోలు రంగ శ్రీ, నంద్ సాయి, జానకి దేవి తమ్మిశెట్టి, ఆర్ఎన్ దర్శన్, శాంతారామ్, ఎస్ నరేష్ కుమార్, డాక్టర్ ఆదిత్ దేశాయ్ ప్రమాణం స్వీకారం చేశారు. టీటీడీ అడిషనల్ ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు.బోర్డు సభ్యులకు రంగ నాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం చేసి ప్రసాదాలు అందించారు. అధికారులు శ్రీవారి చిత్రపటం, డైరీలు, క్యాలెండర్లు అందజేశారు. మధ్యాహ్నం 2 గంటలకు పి రామ్మూర్తి ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీ ఈవోలు లోకనాథం, ప్రశాంతి, భాస్కర్ లు పాల్గొన్నారు.



# మంత్రి సముచిత నిర్ణయం

- చిన్న కాంట్రాక్టర్ల ఉపశమనం
- కాంట్రాక్ట్ బిడ్‌ల కాలపరిమితి ఐదేళ్లకు పెంపుదల
- ప్రభుత్వ తీరుపై సర్వత్రా హర్షం

అమరావతి (చైతన్యరథం) : రాష్ట్రంలో కాంట్రాక్టర్లు అందరికీ మేలు చేసే విధంగా ఐదు ఏళ్ల బ్లాక్ పీరియడ్ కాల పరిమితిని పది ఏళ్లకు పెంచుతూ రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. కీలకమైన ఈ నిర్ణయం చిన్న తరహా కాంట్రాక్టర్లకు పెద్ద మేలు జరుగుతుందని అధికారులు సైతం చెబుతున్నారు. గత ప్రభుత్వ కాలంలో రాష్ట్రంలో కాంట్రాక్టర్లు పెద్దగా అభివృద్ధి పనులు చేపట్టిన దాఖలా లేదు. 3 ఏళ్ల పాటు కరోనా వల్ల పనులు జరగకపోవడం ఒక కారణం అయినప్పటికీ గత ఐదు ఏళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి ఊసే లేక పోవడంతో ఆయా కాంట్రాక్టర్లకు పనులు చేసే అవకాశం రాలేదు.. ఒకవేళ పనులు చేపట్టినా, బిల్లులు రాకపోవడం పరిసితిని మరింత దిగజార్చింది. ఈ పరిసితసల్లో ఈ శాఖ కాంట్రాక్టర్లు బిడ్ వేసేందుకు అర్హత కోల్పోయే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. జీచీ్ రాష్ట్రంలోని మెజార్టీ కాంట్రాక్టర్లు ఆయా పనులు చేపట్టడానికి తగిన అర్హత లేకుండా పోయింది.. ముఖ్యంగా రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ఆర్ & బీ శాఖలో జరగబోయే రోడ్ల అభివృద్ధి & మరమ్మతులు వంటి పనులు చేపట్టేందుకు, గతంలో 5 ఏళ్ల కాల పరిమితిలో ఆయా కాంట్రాక్టర్లు చేపట్టిన పనులు, టర్నోవర్ వంటివి ప్రాతిపదికగా తీసుకుంటే మెజార్టీ కాంట్రాక్టర్లు నేడు నష్టపోయే పరిస్థితి ఉంది.. ముఖ్యంగా 5 సంవత్సరాల కాల పరిమితిని అర్హత గా తీసుకోవడం వల్ల మెజార్టీ కాంట్రాక్టర్ లు, సామర్థ్యం ఉన్నా, అర్హత లేక ఆయా కాంట్రాక్ట్ పనులు చేపట్టే అవకాశం కోల్పోతారు.. ఈ నేపథ్యంలో చిన్న, మధ్య తరగతి కాంట్రాక్టర్ల నుంచి వచ్చిన వినతుల మేరకు ఆర్ & బీ శాఖ తరఫున కాంట్రాక్టర్ల అందరి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునికాల పరిమితిని 5 నుంచి 10 ఏళ్లకు పెంచాలనే సానుకూల నిర్ణయం మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తీసుకోవడం జరిగింది.. దీంతో రాష్ట్రంలోని మెజార్టీ కాంట్రాక్టర్లకు ఆర్ & బీ పనుల టెండర్లలో పాల్గొనే అవకాశం కల్పించేందుకు వీలుపడుతోంది.

# అరబిందో భారీ దందా




- ❑ 108 అంబులెన్సుల నిర్వహణలో కుంభకోణం
- ❑ పక్కదారి పట్టిన ప్రజల సొత్తు
- ❑ విజయసాయిరెడ్డి వియ్యంకుడి సంస్థకి దోచిపెట్టిన జగన్ రెడ్డి
- ❑ బాధితులను సకాలంలో ఆస్పత్రులకి చేర్చని సంస్థ
- ❑ వందల మంది అమాయకుల ప్రాణాలు బలి
- ❑ యాజమాన్యంపై ఐపీసీ 302 సెక్షన్ కింద కేసులు పెట్టాలి
- ❑ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి ధ్వజం

నెల్లూరు (చైతన్యరథం): 108 అంబులెన్సుల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం తమకు రూ.141 కోట్లు చెల్లించాలని అరబిందో కంపెనీ ప్రచారం చేయడంపై టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విరుచుకు పడ్డారు. ఏ2 విజయసాయిరెడ్డి వియ్యంకుడు రాంప్రసాద్ రెడ్డి, తన అల్లుడు రోహిత్ కు చెందిన అరబిందో కంపెనీ అరాచకాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో 108 బాధ్యతలను చేజిక్కించుకున్న అరబిందో కంపెనీ వందల కోట్లు దోచుకోవడవడమే కాకుండా ఎంతో మంది అమాయకుల ప్రాణాలు తీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాపాయంలో ఉన్న వారిని సకాలంలో ఆస్పత్రులకు తరలించడంలో అరబిందో కంపెనీ ఘోరంగా విఫలమైందన్నారు. గోల్డెన్ అవర్ పాటించడంలో ఫెయిల్ అయిందని కాగ్ నివేదిక గతంలోనే స్పష్టం చేసిందని వివరించారు. 108 అంబులెన్సుల నిర్వహణలో అరబిందో కంపెనీ వైఫల్యాన్ని కాగ్ బట్టబయలు చేసిన తర్వాత అప్పటి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేని ఆరోపించారు.

గోల్డెన్ అవర్ పాటించి ఆదుకోవాల్సిన 108 అంబులెన్సువాహనాలను అమాయకుల ప్రాణాలు బలితీసే మృత్యుశకటాలుగా మార్చారన్నారు. పొరపాటున కత్తి తగిలి మనిషి ప్రాణాలు పోతే హత్య కేసు నమోదు చేసి జైలుకు పంపుతారు. వందల కోట్ల అక్రమ సంపాదన కోసం అమానుష చర్యలకు తెగబడిన అరంబిందో పై యాజమాన్యంపై ఐపీసీ 302 సెక్షన్ కింద హత్య కేసు నమోదు చేయాలన్నారు. వందల మంది ప్రాణాలు బలితీసుకున్న నేరానికి రూ.141 కోట్లు చెల్లించాలని అరబిందో కోరడం పైశాచికత్వానికి నిదర్శనమన్నారు. 2011 నుంచి 2016 వరకు 108 అంబులెన్సుల నిర్వహణ బాధ్యతను జీవీకే సంస్థ సమర్థవంతంగా నిర్వహించిందని గుర్తు చేశారు. అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం 2016 నుంచి 2021 వరకు కూడా అదే సంస్థను పొడిగించిందన్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే జీవీకే సంస్థతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని ఒక జీఓ ద్వారా బలవంతంగా రద్దు చేసిందన్నారు. జీవీకే సంస్థ చేసుకున్న ఒప్పందం ప్రకారం ఒక్కో అంబులెన్సుకు నెలకు రూ.1.31 లక్షలు అయితే అరబిందో కంపెనీకి రూ.1.78 లక్షలు చెల్లించారన్నారు.

కొత్త అంబులెన్సుకు సంబంధించి మరింత బరి తెగించి నెలకు రూ.2.21 లక్షలకు పెంచారన్నారు. నిర్వహణ ఖర్చుల్లో చేసిన ఈ మార్పులతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై రూ.800 కోట్లకు పైగా భారం పడిందన్నారు. ఎవడబ్బ సొత్తు అని అరబిందో కంపెనీకి దోచిపెట్టారని నిలదీశారు. అరబిందో కంపెనీపై అంత ప్రేమ ఎందుకో ప్రజలకు తెలిసి పోయిందన్నారు.

ఏ2 విజయసాయిరెడ్డి వియ్యకుండి కంపెనీకి ప్రజల సొత్తును దోచిపెట్టేందుకు ఆరు నెలల్లో 6 జీఓలు ఇచ్చారన్నారు. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ పర్యవేక్షణలో ఉన్న 108 అంబులెన్సులను ఆరోగ్య శ్రీ పరిధిలోకి మార్చాల్సిన అవసరం ఏమొచ్చిందన్నారు. రాజశేఖర్ రెడ్డి ఎవరని ప్రత్యేక జీఓ ద్వారా ఆరోగ్య శ్రీ డిప్యూటీ సీఈఓగా నియమించారని నిలదీశారు. మరో జీవోతో ఉద్యోగోన్నతి కల్పించారు.

జగన్మోహన్ రెడ్డికి తోడుగా జైలులో ఉన్న ఏ2 విజయసాయిరెడ్డి దోచుకోవడానికి సలహాలు చెప్పాడని, బయటకు వచ్చి వాటిని పకడ బందీగా అమలు చేశారని ఆరోపించారు. చెత్త భాషతో సోషల్ మీడి యాలో విమర్శలు చేస్తాడని ప్రజల సొత్తు అప్పనంగా దోచిపెట్టాలా అని ప్రశ్నించారు. విజయసాయి రెడ్డి వియ్యకుండి కంపెనీ కోసం విచ్చలవిడిగా జీఓలు ఇచ్చి ప్రజల సొత్తు దోచిపెట్టిన నేరం క్షమించరానిదన్నారు. ఆరోగ్య సేవల ముసుగులో అరబిందో కంపెనీ పాల్పడిన అరాచకాలపై విచారణ జరపాలని ప్రభుత్వాన్ని కోరారు.

108 అంబులెన్సుల నిర్వహణ, గోల్డెన్ అవర్ పాటించడం వైఫల్యం వంటి నేరాలకు పాల్పడిన ఆ సంస్థపై హత్య కేసు నమోదు చేయాల్సిందేనన్నారు. ఎంత మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారో తేలాలన్నారు. అంబులెన్సుల ట్రిప్పుల నమోదులోనూ అక్రమాలు జరిగాయన్నారు. గత ఐదేళ్లలో జరిగిన భారీ దోపిడీపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని సోమిరెడ్డి పేర్కొన్నారు.

# నేతలు కాదు రాబందులు

- పరిహారం ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసిన వైసీపీ నేతలు
- భర్త చనిపోతే భార్యకు తెలియకుండా భూమి కబ్జా
- రుణం ఇప్పిస్తానంటూ భారీ టోకరా
- తమకు న్యాయం చేయాలంటూ బాధితులు మొర
- టీడీపీ కేంద్ర కార్యాలయానికి తరలివచ్చిన అర్జీదారులు



అమరావతి (చైతన్యరథం) : కడప - రేణిగుంట నేషనల్ హైవేలో తమ ఇళ్లు, షాపులు పూర్తిగా కోల్పోయిన బాధితుల ఆవేదన వరనా తీతం. న్యాయం కోసం వైసీపీ మాజీ ఎమ్మెల్యేను వేడుకుంటే అనుచరుల ద్వారా లంచాల కోసం తెగబడ్డారని తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కరకంబాడి బీసి కాలనీకి చెందిన బాధితులు వాపోయారు. పరిహారం ఇప్పించమంటే ఎమ్మెల్యే తమ వద్దకు పంపించిన వైసీపీ రేణిగుంట మండల నాయకుడు ఒక్కొక్కరి వద్దనుండి రూ. 5 లక్షలు డిమాండ్ చేశాడని ఆరోపించారు. దానికి తాము అంగీకరించకపోవడంతో తమకు రావాల్సిన పరిహారాన్ని అడ్డుకున్నారని ఫిర్యాదు చేశారు. పరిహారం ఇప్పించి న్యాయం చేయాలని నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలు మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు, **SEEDAP** ఛైర్మన్ గుణపాటి దీపక్ రెడ్డి, తెలుగురైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిలకు విన్నవించుకొన్నారు. ఈ సందర్భంగా నేతలు బాధితుల నుండి అర్జీని స్వీకరించి న్యాయం చేస్తామని వారికి హామీ ఇచ్చారు.

తిరుపతి జిల్లా తిరుపతి నగరంలోని కోర్లగుంట మారుతినగర్‌కు చెందిన వి రాధ తదితరులు విజ్ఞప్తి చేస్తూ.. 5వ వార్డుకు చెందిన వైసీపీ నేతలు రోడ్డును ఆక్రమించి దారి లేకుండా చేస్తున్నారని గతంలో ఎన్నో సార్లు దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా గత ప్రభుత్వంలో ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు. వైసీపీ నేతల కబ్జాపై విచారించి వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వేడుకున్నారు.

తన భర్త చనిపోతే.. తన పేరుమీద ఉన్న స్థలానికి తప్పుడు రికార్డులు సృష్టించి వైసీపీ నేతలు స్థలాన్ని కబ్జా చేశారని.. దీనిపై ఎమ్ఆర్ పల్లె పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. తనకు న్యాయం చేయాలని చిత్తూరు జిల్లా బంగారుపాళ్యానికి చెందిన డి. భారతి నేతలను వేడుకున్నారు.

పిచ్చాటూరు మండల టీడీపీ నేత మణియం తిరుమలై రెడ్డి విజ్ఞప్తి చేస్తూ.. సీసీ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని.. కానీ కష్టపడిన తమకు పనులు దక్కకుండా.. వైసీపీ నేతల వద్ద లంచాలు తీసుకుని వారికి స్థానిక ఎమ్మెల్యే పనులు కట్టబెడుతున్నారని.. దయ చేసి టీడీపీలో కష్టపడిన వారికి న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

తనకు రుణం ఇప్పిస్తామని చెప్పి జిల్లా పరిశ్రమల కేంద్రం కాకినాడ కార్యాలయంలో సుపరింటెండెంటుగా పనిచేస్తున్న పిల్లి రమేష్ అనే వ్యక్తి తమ వద్ద రూ. 19 లక్షలు డబ్బులు తీసుకుని మోసం చేశాడని పలువురు బాధితులు బుధవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఇప్పిస్తానన్న రుణం ఇప్పించకపోవడంతో ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వమంటే తమను కులం పేరుతో తిట్టాడని.. అతనిపై చర్యలు తీసుకోవాలని పలువురు బాధితులు వేడుకున్నారు.



ఏలూరు జిల్లా పోలవరం మండలం కొరుటూరు గ్రామానికి చెందిన తిప్పర్తి నాగేశ్వరరావు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ భూసేకరణలో భాగంగా తన ఇంటిని కోల్పోవాల్సి వచ్చిందని తెలిపారు. దానికి పరిహారంగా ఐదు సెంట్ల ఇళ్ల స్థలం ఇస్తానని చెప్పి సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ ఎటువంటి స్థలం ఇవ్వలేదని.. దాంతో అద్దె ఇంట్లో ఉంటూ అద్దెలు కట్టుకోలేక ఇబ్బంది పడుతున్నట్లు తనకు ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజ్ తో పాటు ఇల్లు ఇప్పించవలసిందిగా వేడుకున్నాడు.

రామకృష్ణ మిడోస్ పేరుతో వెంచర్ వేశామని తమను నమ్మించి అందులో ఉండే మేనేజింగ్ పార్టనర్ కేపీపీ అంజనీకుమార్ తమ వద్ద రూ. 16,63,000 డబ్బులు తీసుకుని ప్లాట్ చూపించకుండా ఇబ్బంది పెడుతున్నాడని చీరాలకు చెందిన జగన్మోహనరావు విజ్ఞప్తి చేశాడు. ఆఫీసుకు వెళ్లి అడుగుతుంటే ఆఫీసులోకి రాకుండా అక్కడి సిబ్బంది ఇబ్బంది పెడుతున్నారని.. రామకృష్ణ మిడోస్ నుండి తమకు ప్లాట్ వచ్చేలా న్యాయం చేయాలని జగన్మోహనరావు విజ్ఞప్తి చేశాడు.















# భక్తిశ్రద్ధలతో విధులు నిర్వర్తిస్తా : ఎం.ఎస్ రాజు

◆ టీటీడీ పాలకమండలి సభ్యుడిగా ఎం.ఎస్ రాజు ప్రమాణస్వీకారం

కలియుగ వైకుంఠం శ్రీవేంకటేశ్వర సన్నిధిలో భక్తిశ్రద్ధలతో తనకు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తిస్తానని మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు ఎం.ఎస్ రాజు వ్యాఖ్యానించారు. బుధవారం టీటీడీ సభ్యుడిగా ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం సతీమణి ఉమాదేవి, కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ వెంకటేశ్వర దర్శనం చేసుకున్నారు. శ్రీవారికి సేవ చేసుకునే భాగ్యం కలిగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎం.ఎస్ రాజు ప్రమాణ స్వీకారోత్సవానికి హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య , సినీ నటులు సప్తగిరి, రఘు తదితరులు పాల్గొన్నారు.



# ముగిసిన పట్టభద్రుల ఓటర్ల నమోదు

వినుకొండ (చైతన్యరథం): ఉమ్మడి కృష్ణ- గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమం 6వ తేదీ బుధవారం సాయంత్రంతో ముగిసింది. వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటర్ల నమోదుకై పట్టణంలోని శివయ్య స్థూపం సెంటర్, వద్ద తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై శిబిరాలను ఏర్పాటు చేయగా పట్టభద్రుల నుండి విశేష స్పందనతో ప్రతిరోజు ఓటర్లు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్సీ టీడీపీ పరిస్థితి భూపతి మాట్లాడుతూ... ఎమ్మెల్యే జీవి అధ్వర్యంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ నమోదు శిబిరాలు వినుకొండ నియోజకవర్గంలోని పట్టభద్రుల ఓటర్లకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. శిబిరాల వద్దకు వచ్చిన ఆఫ్‌లైన్ ద్వారా 1108 స్వీకరించిన దరఖాస్తులను ప్రతిరోజు రెవిన్యూ కార్యాలయంలో అందజేయడం జరిగింది. అలాగే ఇప్పటి వరకు నియోజకవర్గంలో దాదాపు 8000 వరకు దరఖాస్తుల ఆన్లైన్ ద్వారా అప్లై చేయడం జరిగిందన్నారు. పట్టభద్రుల ఓటర్ల నమోదు శిబిరాలను ఏర్పాటు చేసి సేవలందించిన స్థానిక ఎమ్మెల్యే జీ.వీ.ఆంజనేయులకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.వి. సురేష్ బాబు, పఠాన్ సుభాని, 22 సుభాని, చికెన్ బాబు, నర్రా కిశోర్, గోల్డ్ కరిముల్లా, పల్లూరి మురళి కృష్ణ, పిద్దారపు ఫరీదు తదితరులు పాల్గొన్నారు.



# భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

◆ టీడీపీ ఇన్‌ఛార్జ్ పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం (చైతన్యరథం): భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పుత్తా నరసింహారెడ్డి వ్యాఖ్యానించారు. నియోజకవర్గంలోని కమలాపురం మండలం దేవరాజుపల్లి గ్రామపంచాయతీలో జరిగిన రీసర్వేలో వచ్చిన పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. సీఎం చంద్రబాబు రాష్ట్రంలో పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చి రైతులకు సాగునీరు అందించేలా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో నిధులు కేటాయిస్తుందన్నారు. రెవెన్యూ సదస్సులు భూసమస్యల పరిష్కారానికి దోహదపడుతాయన్నారు.

# రైతుల ఉన్నతే ప్రభుత్వ అజెండా

◆ నూతన విద్యుత్ లైన్ల పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల



మార్కాపురం (చైతన్యరథం): రైతుల ఉన్నతే ప్రభుత్వ అజెండా అని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి వ్యాఖ్యానించారు. గ్రామాల్లో రైతుల కళ్ళల్లో ఆనందం నింపేందుకు ఈఆర్.డి.ఎస్.ఎస్ పథకం ద్వారా నూతన విద్యుత్ లైన్లను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని పెద్ద యాచవరం గ్రామం, తర్లుపాడు మండలంలోని కలుజువ్వలపాడు, కొనకనమిట్ల మండలంలోని చౌటపల్లి గ్రామం, పొదిలి మండలంలోని కంబాలపాడు గ్రామాల్లో ఆర్.డి.ఎస్.ఎస్ పనులను కందుల నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సచివాలయాల్లో ప్రజల సమస్యలు అడగి తెలుసుకొని అక్కడికక్కడే వాటిని పరిష్కరించారు. నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటుతో రైతుల పొలాలకు గ్రామాల్లో ఎటువంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా ఉంటుందని భావించి మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్ని గ్రామాల్లో ఈ పథకం ద్వారా నూతన కరెంట్ లైన్లను ఏర్పాటు చేయాలని సూచించారని, ముఖ్యమంత్రి సూచనల మేరకు నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని కందుల నారాయణరెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, ఆయా మండలాల తెలుగుదేశం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజలు మనల్ని చరిత్ర సృష్టించే మెజారిటీతో గెలిపించారు

◆ అభివృద్ధి, సంక్షేమ పథకాలు సామాన్యులకు అందేలా కృషి చేస్తాం

◆ వెల్లడించిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి



నెల్లూరు (చైతన్యరథం): ప్రజలు మనల్ని చరిత్ర సృష్టించే మెజారిటీతో గెలిపించారని, వారికి అభివృద్ధి, సంక్షేమ పథఖాలు సామాన్యులకు అందే విధంగా కృషి చేస్తామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఎక్కడా రాజకీయ వివాదాలకు, కక్ష సాధింపు చర్యలకు పాల్పడవద్దు అభివృద్ధి, సంక్షేమ పథకాలు సామాన్యులకు అందే విధంగా కృషి చేయాలని కోరారు. బుధవారం నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని 30 డివిజన్ నక్కా గోపాల్ నగర్‌లో 35 లక్షల రూపాయల వ్యయంతో రోడ్లు, పైప్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి కార్యక్రమాలకు ఏమాత్రం నిధులు విడుదల చేయలేదు. రాబోయే రోజుల్లో 26 డివిజన్లలో ఒక్కో డివిజన్‌కు అభివృద్ధి పనులకు కోటి రూపాయలు నిధులు కేటాయిస్తాం. ఎక్కడా కూడా రాజకీయ వివాదాలకు కక్ష సాధింపు చర్యలకు పాల్పడవద్దు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు సామాన్యులకు అందే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ మన్నేపల్లి రఘు, డివిజన్ ఇన్‌ఛార్జ్ అషిక్ అలీఖాన్, డివిజన్ అధ్యక్షుడు మన్నెమాల శ్రీనివాసులురెడ్డి, మాజీ ఏఎమ్‌సీ చైర్మన్ కూకటి హరిబాబు యాదవ్, టీడీపీ నాయకులు అత్తివరపు యానదయ్య, ఓబుల్ రాజు, బత్తల కృష్ణ, పల్నాటి మస్తాన్ నాయుడు, ఖాదర్ బాషా, కరీముల్లా, జున్ను, కరీముల్లా, నాయబ్ రసూల్, మస్తాన్ నాయుడు, తురక ఆనందరావు, షేక్ జమీర్, తురక కృష్ణ, కూకటి రాజేష్, కూకటి వేణు, సారధి, కొప్పోల విగ్నేశ్వర రావు, అస్లాం బాయ్, షేక్ ఖాజా, లియాఖత్ ఖాన్, అఫీజ్ హుస్సేన్, ఖాదర్ బాషా , కొండూరి మహేష్, హాఫిజ్, బంగారు రమణయ్య, శేషయ్య, పెంచలయ్య, విక్రమ్, మున్వార్ , ఖాజా, మస్తాన్ (దాణిక్యపురి), బద్దేపూడి కృష్ణ, ధుర్గ, కర్నాల సుబ్బారావు,రాముడు, లక్ష్మణుడు, డిల్లి బాబు, కిరణ్, గాడిపర్తి ప్రసాద్, శివ రామ రాజు, రాజయ్య, ఆనందరావు,ప్రసాద్, రమేష్, అభిదా సుల్తానా, పల్లెపాటి వెంకట లక్ష్మీ, కరీమా,కొండూరు నాగలక్ష్మి, ఆరిఫా, రుక్మిణీ, వసంతమ్మ, జనసేనా పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ నాగరత్నం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఉద్యోగాలు కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం

◆ దామచర్ల జనార్ధన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా




ఒంగోలు (చైతన్యరథం) : యువతకు ఉద్యోగాలు కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమని టీడీపీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్ వ్యాఖ్యానించారు. బుధవారం ఒంగోలులో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు నిరుద్యోగులు వేలాదిగా తరలివచ్చారు. షార్ప్ ఇండియా వారి సహకారంతో సుమారు 38 కంపెనీలు ఈ జాబ్ మేళాకు హాజరైయ్యారు. 3650 మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేసుకోగా అందులో 1262 మందికి ఎంపికైనట్లు ఎమ్మెల్యే జనార్ధన్ తెలిపారు. వివిధ హోదాల్లో ఎంపికైన వారికి ఎమ్మెల్యే దామచర్ల అఫర్ లెటర్ అందజేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే మొదటి సంతకం మెగా డీఎస్సీ మీదే చేశారన్నారు. నియోజకవర్గానికి బహుళ జాతి కంపెనీలను రప్పించి నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పిస్తామన్నారు. భవిష్యత్తులో మరెన్నో ఉద్యోగాలు కల్పించేందుకు యువతకు అండగా నిలుస్తాని చెప్పారు. ఈ కార్యక్రమంలో దామచర్ల అనిషా లక్ష్మి, కంపెనీ ప్రతినిధులు, షార్ప్ ఇండియా అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వేగుళ్ళ సూచనల మేరకు మండపేటలో డీఎంహెచ్ఓ పర్యటన

మండపేట (చైతన్యరథం): శాసనసభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు సూచనల మేరకు డీఎంహెచ్‌ఓ జి.దుర్గారావు దొర బుధవారం మండపేట పట్టణంలో పర్యటించారు. మండపేట పట్టణంలో గొల్లపుంతలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్, రాయవరం పి.హెచ్.సిలను డి.ఎం అండ్ హెచ్ ఓను పరిశీలించారు. మండపేట ఎం.పి.డి.ఓ ఆఫీస్ ప్రక్కన గల అర్బన్ హెల్త్ సెంటర్ ను ఎమ్మెల్యే వేగుళ్ళతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి సమస్యలు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ చుట్టూ పరిసరాలు, మందులు, సిబ్బంది కొరతపై ఆరాతీశారు. ఎ.ఎన్.ఎంలు కొరత ఉందని అక్కడి వైద్యులు తెలపటంతో మున్సిపల్ కమీషనర్‌తో మాట్లాడి సిబ్బంది కొరత లేకుండా ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వచ్చిన పేషెంట్‌లకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని వైద్యులకు సూచించారు.



# పెండింగ్ బిల్లుల విడుదలకు ఆమోదంతో ఎంతోమందికి న్యాయం

◆సీఎం, డిప్యూటీ సీఎంకు ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ (చైతన్యరథం): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి సంబంధించి పెండింగ్ బిల్లులు విడుదలకు పచ్చ జెండాతో ఎంతోమందికి న్యాయం జరగబోతోందని తెలుగుదేశం పార్టీ సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వ్యాఖ్యానించారు. కీలకమైన ఆ నిర్ణయం తీసుకున్న రాష్ట్ర మంత్రివర్గానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. 2014-15 నుంచి 2018-19 మధ్య పనులు చేసి, బిల్లులు రాక ఇంతకాలం ఎన్నో అవస్థలు పడుతున్న కాంట్రాక్టర్లు, సబ్ కాంట్రాక్టర్లకి ఇది ఊపిరి నిలిపే శుభవార్తగా పేర్కొన్నారు. బుధవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గంలో ఈ మేరకు నీరు చెట్టు పనుల బకాయిల చెల్లింపులు చేయాలన్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంతోమంది అప్పులు తెచ్చి మరీ పనులు చేసినా జగన్ ప్రభుత్వ కక్ష సాధింపుల కారణంగా బిల్లులు నిలిపివేయడంతో ఆత్మహత్యలు చేసుకున్న ఉదంతాలు కూడా చూడాల్సిన వచ్చిందని ఆయన ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. 2019లో జగన్ ప్రభుత్వం




రావడంతోనే నీరు చెట్టు కింద పనులు చేసిన వారికి కష్టాలు మొదలయ్యాయని, సుమారు రూ.1,216.84కోట్ల బిల్లులు చెల్లించకూడదనే దుర్మార్గమైన నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు. తర్వాత కోర్టు కేసులతో మెట్టుదిగినా విజిలెన్స్ తనిఖీల పేరుతో వేధింపులకు పాల్పడి బిల్లులన్నీ పెండింగ్‌లో ఉంచారన్నారు. వాటికి సంబంధించి కూటమి ప్రభుత్వం రాగానే ఆగస్టులో రూ.256 కోట్లు కేటాయించారన్న జీవీ ఇప్పుడు మంత్రివర్గం ఆమోదంతో మిగిలిన బకాయిలు కూడా చెల్లింపులు చేసే అవకాశం వచ్చిందన్నారు. జగన్ పాలనలో మరీ ముఖ్యంగా తెలుగుదేశంపార్టీ మద్దతుదారులు, సానుభూతిపరులను దారుణంగా ఇబ్బందులకు గురిచేశారని, కోలుకోలేని స్థాయిలో దెబ్బతీశారన్నారు. అవన్నీ గమనించే ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన అనేక సందర్భాల్లో పెండింగ్ బిల్లుల గురించి ప్రస్తావించానని, ఇంతకాలంగా అందరి ఎదురుచూపులకు మోక్షం లభించి ఫలితం దక్కుతున్నదందుకు సంతోషంగా ఉందన్నారాయన. ఇదే సమయంలో నీరుచెట్టు పనులు తిరిగి ప్రారంభించాలన్న నిర్ణయంతో అందరికీ మళ్లీ మేలు జరిగే అవకాశం వస్తుందన్నారు. అలానే మంత్రివర్గం ఆమో దం పొందిన భూకబ్జా నిరోధక చట్టంతో ఇంతకాలంగా పేట్రేగిపోయిన కబ్జాకోరులకు ముకుతాడు పడుతుందన్నారు. కొత్త చట్టం ప్రకారం ఆక్రమణ దారులకు 10-14 ఏళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉండడంతో భూఆక్రమాల ఆలోచనలు రావాలంటే భయం పుట్టే అవకాశం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జగన్ - కూటమి ప్రభుత్వానికి ఇదే తేడా అన్న ఎమ్మెల్యే జీవీ వాళ్ల తీసుకుని వచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ప్రజల ఆస్తులను తన్నుకు పోయేలా ఉంటే, దానిని రద్దు చేయడంతో పాటు సీఎం చంద్రబాబు ఇలా కబ్జాల నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకుని రావడం ద్వారా ప్రజల్లో వారి ఆస్తులు వారివే అనే నమ్మకాన్ని పెంచడానికి వీలవుతుందని అభిప్రాయపడ్డారు.

## ఆటోనగర్‌లో లేటెస్ట్ టెక్నాలజీ హీట్ బూత్ ఏర్పాటుకు కృషి

◆ఎంపి కేశినేని శివనాథ్ వెల్లడి



విజయవాడ (చైతన్యరథం): ఆటోమొబైల్ రంగంలో వున్న పెయింటర్స్‌కి అండగా వుంటానని, వారి సమస్యలు పరిష్కరించటమే కాకుండా, పలు పెయింట్స్ కంపెనీలతో మాట్లాడి ఆటోనగర్‌లో లెటెస్ట్ టెక్నాలజీ హీట్ బూత్‌లు ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తానని ఎంపి కేశినేని శివనాథ్ వెల్లడించారు. ది ఆటో మొబైల్ టెక్నిషియన్ అసోసియేషన్ (ఎ.టి.ఎ) మాజీ అధ్యక్షులు గొల్లపూడి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విజయవాడ మోటార్ పెయింటర్స్ అసోసియేషన్, ది విజయవాడ మోటారు స్ప్రే పెయింటర్స్ వెల్ ఫేర్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం ఎంపి కేశినేని శివనాథ్‌ను కలిశారు. వారి సమస్యలను ఎంపి కేశినేని శివనాథ్ అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఏడాది లారీలు బ్రేక్ ఇన్స్పెక్షన్ కి వెళ్లినప్పుడు పెయింటింగ్ వేయించుకుని రావాలనే విధంగా నిబంధన తీసుకువస్తే... పెయింటర్స్‌కి పనులు వుంటాయని తెలిపారు. పెయింటర్స్ అసోసియేషన్స్ నాయకులు సమస్యలపై ఎంపి కేశినేని శివనాథ్ సానుకూలంగా స్పందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆటోనగర్‌కి పూర్వ వైభవం రానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ మోటర్ పెయింటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.వీరచారి, చైర్మన్ కె.వెంకటకృష్ణ, సెక్రటరీ ఎస్.కె.ఖాజా, వైస్ ప్రెసిడెంట్ సురేష్, కోశాధికారి పగడాల సురేష్, ది విజయవాడ మోటారు స్ప్రే పెయింటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.వి.ఆంజనేయులు, సెక్రటరీ ఎస్.నారాయణ, ఎలక్ట్రికల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కొడూరు ఆంజనేయులు, సెక్రటరీ జాస్తి సురేష్ పాల్గొన్నారు.



## గత ప్రభుత్వ పాపాలతో పేదలకు ఇబ్బందులు

◆ఎమ్మెల్యే గళ్ళా మాధవి

◆డంబర్ బిన్స్ కొనుగోలుకు స్వచ్ఛందంగా రూ.లక్ష చెక్కు ఎమ్మెల్యేకు అందజేత

గుంటూరు (చైతన్యరథం): గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటాలకు పోయి జగనన్న కాలనీల పేరుతో పేదలను మోసం చేసిందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి విమర్శించారు. బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 49వ డివిజన్‌లోని శారద కాలనీ 1వ లైన్‌లో ఆమె పర్యటించారు. ప్రధానంగా శారద కాలనిలో సుమారు 120 కుటుంబాలు కాలువల మీద ఇళ్ళు నిర్మించుకొని జీవిస్తున్నారని, వీటిని తొలగించమని మున్సిపల్ అధికారులు తమను ఇబ్బంది పెడ్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొనిరాగా, క్షేత్ర స్థాయిలో వీటిని పరిశీలించిన ఎమ్మెల్యే, అధికారుల నుండి వివరాలు అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వరద ముప్పు నుంచి ఈ ప్రాంత వాసులు బయటపడాలంటే డ్రెయిన్ ఆక్రమణలు తొలగించాల్సిందేనని ఉద్ఘాటించారు. అదే సమయంలో వారికి ప్రత్యామ్నాయం చూపించవలసిన బాధ్యత ప్రభుత్వం ఉన్నాదని, గత ప్రభుత్వం వీరికి వివిధ ప్రాంతాల్లో జగనన్న కాలని పేరిట ఇళ్ళు మంజూరు చేసిందని, వీటి నిర్మాణం మొత్తం నాసిరకంగా ఉండటమే కాక, కనీస మౌలిక సదుపాయాలైన రోడ్లు, కాలువలు, మంచి నీరు వంటివి కల్పించకుండా, గాలికి వదిలివేయటం వలనే, ఈ రోజు పేదలు అక్కడికి వెళ్ళటానికి ఇష్టపడటం లేదన్నారు. తొలుత వారికి కేటాయించిన స్థలాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, అప్పుడు ఆక్రమణలు తొలగించాలని అధికారులను మాధవి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దిరాల మ్యాని, సుధీర్, వేణు, నంది సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

### నియోజకవర్గాన్ని పరిశుభ్రమైన ప్రాంతంగా తీర్చిదిద్దుతాం : గళ్ళా మాధవి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.అవసరమనుకుంటే స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుంటామన్నారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ ద్వారా చెత్తపై యుద్ధం చేసి... విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక 49వ డివిజన్ సచివాలయం సమీపంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేపడుతున్న స్పెషల్ సానిటరీ డ్రైవ్‌కి తనవంతు సహకారం అందించాలన్న లక్ష్యంతో టీడీపీ నాయకురాలు నంది సరస్వతి సౌజన్యంతో 5 డంబర్ బిన్ల (చెత్త కుండి) కొనుగోలుకు రూ.లక్ష రూపాయలు చెక్కును ఎమ్మెల్యే మాధవికి అందజేయగా, వెంటనే డంబర్ బిన్స్ కొనుగోలు చేసి వేలాంగిణి నగర్, భరత్ పేట, శారద కాలనిలలో ఏర్పాటు చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఒక ఉద్యమంలా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ జరుగుతోందని, పరిసరాల పరిశుభ్రత ద్వారానే ఆరోగ్యకర సమాజం సాధ్యమని, ఆ దిశగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దిరాల మ్యాని, టి సుధీర్, నంది, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## మైలవరంలో ముమ్మరంగా గ్రాడ్యుయేట్ ఓట్ల నమోదు

◆పరిశీలించిన నియోజకవర్గ ఎమ్మెల్యే వసంతకృష్ణ ప్రసాద్



మైలవరం (చైతన్యరథం) : పట్టభద్రుల ఎన్నికల ఓట్ల నమోదు గడువు ముగింపు దశకు చేరుకోవడంతో ఎమ్మెల్యే వసంతకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఓట్ల నమోదు పెద్దఎత్తున నిర్వహించారు. ఓటర్ల మోదు ప్రక్రియను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ స్వయంగా పర్యవేక్షించారు. పార్టీ పిలుపు మేరకు ఎప్పటికప్పుడు పార్టీ శ్రేణులకు సమాయత్తం చేస్తున్నారు. బుధవారం విజయవాడ రూరల్ మండలంలోని గొల్లపూడిలో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటుహక్కు నమోదు కేంద్రంలో శాసనసభ్యులు కృష్ణప్రసాద్ పాల్గొని ఓటు హక్కు దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ... నేటితో ఓటర్ల నమోదు ప్రక్రియ గడువు ముగుస్తుందన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు కోసం అందరూ సత్వరమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. నవంబర్ 23న ఓటర్ల జాబితా ముసాయిదా ప్రకటన... డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారన్నారు. డిసెంబర్ 30న ఓటర్ల తుది జాబితా ప్రకటన ఉంటుందన్నారు. వచ్చే ఏడాది మార్చిలో ఎన్నికలు నిర్వహిస్తారని అన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల అభ్యర్థిగా ఎన్డీయే మహాకూటమి బలపర్చిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పోటీ చేస్తున్నారని, అందరూ ఆయన ఘన విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే మహాకూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పూతలపట్టు ప్రాంతంలో మినీ గోకులం షెడ్లను పెంచండి

◆అధికారులకు వినతి పత్రం అందజేసిన సప్తగిరి ప్రసాద్

పూతలపట్టు (చైతన్యరథం) : పూతలపట్టు ప్రాంతంలో మినీ గోకులం షెడ్లను పెంచాలని అధికారులకు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ వినతిపత్రం అందజేశారు. పూతలపట్టు, ఐరాల, బంగారుపాలెం, యాదమరి, తవణంపల్లి మండలాల్లో మినీ గోకులం షెడ్లకి పాడి రైతులు నుండి అధికంగా విజ్ఞప్తులు వస్తున్నాయని, దాదాపు 2,50,000 మంది ఉన్న జనాభాలో దాదాపు 1 లక్ష మంది పైచిలుకు కుటుంబాలు, పాడి పరిశ్రమపైన ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. కేవలం నియోజకవర్గం మొత్తానికి 400 షెడ్లు కూడా మంజూరు చేయకపోవడంతో పాడిరైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ గోకులం షెడ్లకి రైతుల నుండి పెద్దఎత్తున విజ్ఞప్తులు వస్తున్నందున పూతలపట్టు నియోజకవర్గంలోని ఐదు మండలాలకి అదనంగా ఒక వెయ్యి మినీ గోకులం షెడ్లు మంజూరు చేయాలని సప్తగిరి ప్రసాద్ కోరారు.



# 370 అధికరణ పునరుద్ధరణకు అసెంబ్లీలో తీర్మానం ఆమోదం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణను పునరుద్ధరించేందుకు ఎన్నికైన ప్రజాప్రతినిధులతో కేంద్రం చర్చలు జరపాలని కోరుతూ జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఒక తీర్మానాన్ని బుధవారం ఆమోదించింది. విపక్ష బీజేపీ సభ్యుల తీవ్ర వ్యతిరేకత, సభలో గందరగోళం మధ్య ఎలాంటి చర్చా లేకుండా మూజువాణీ ఓటుతో తీర్మానం ఆమోదం పొందినట్టు స్పీకర్ ప్రకటించారు. ఉప ముఖ్యమంత్రి సురిందర్ కుమార్ చౌదరి ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

అనంతరం ఉప ముఖ్యమంత్రి చౌదరి మీడియాతో మాట్లాడుతూ, 2019లో జమ్మూకశ్మీర్ నుంచి లాక్కున్న ప్రత్యేక ప్రతిపత్తి గురించే తాము మాట్లాడుతున్నామని, బీజేపీకి నార్కో టెస్ట్ జరిపితే వాళ్లు కూడా ఇదే మాట అంటారని ఆ పార్టీపై మండిపడ్డారు. జమ్మూకశ్మీర్‌లో బయట నుంచి వచ్చిన వారు ఆస్తులు కొనుగోలు చేస్తుండటంతో కేంద్రపాలిత ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని అన్నారు. బయట నుంచి వచ్చిన వారు ఉద్యోగాలు పొందుతున్నారని చెప్పారు. జమ్మూకశ్మీర్ ప్రజల భవిష్యత్తును పరిరక్షించేందుకు తాము ఈ తీర్మానం ప్రవేశపెట్టినట్టు చెప్పారు.

"బీహార్, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని బీజేపీ ప్రామిస్



చేసింది. వాళ్లు రాముడి పేరు (అసెంబ్లీలో) తెచ్చారు. వాళ్లకు మేము చెప్పదలచుకున్నది ఒకటే. ప్రతి ఒక్కరికి హక్కులు ఉంటాయి. జమ్మూకశ్మీర్‌కూ ప్రత్యేక హోదా కావాలి. లెఫ్టినెంట్ గవర్నర్ హయాంలో రాజౌరి, చినాబ్ వ్యాలీ, కథువా, సాంబలో ఉగ్రవాదాన్ని తుడిచిపెట్టారా?" అని చౌదరి ప్రశ్నించారు.

జమ్మూకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించే 370వ అధికరణను తొలగించడం ఏకపక్షమని జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానం పేర్కొంది. "జమ్మూకశ్మీర్ ప్రజల గుర్తింపు, సంస్కృతి, హక్కుల పరిరక్షణకు రాజ్యాంగ పరమైన హామీలను ప్రత్యేక ప్రతిపత్తి కల్పించింది. దీని ప్రాధాన్యతను మరోసారి లెజిస్లేటివ్ అసెంబ్లీ బలంగా చాటుతోంది. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణను ఏకపక్షంగా తొలగించడంపై ఆందోళన వ్యక్తం చేస్తోంది" అని ఈ తీర్మానం పేర్కొంది. కాగా, ఈ తీర్మానాన్ని బీజేపీ విపక్ష నేత సునీల్ శర్మ సహా ఆ పార్టీ సభ్యులు వ్యతిరేకించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని సునీల్ శర్మ అన్నారు. లెఫ్టినెంట్ గవర్నర్ ప్రసంగంపై చర్చ అని తమకు చెప్పి సభలో ఈ తీర్మానం ప్రవేశపెట్టడటం ఏమిటని నిలదీశారు. తీర్మానానికి నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ మద్దతు పలికాయి. విపక్ష సభ్యులు మాట్లాడడానికి ముందుకు రాకపోతే ఓటింగ్‌కు పెడతానని స్పీకర్ అబ్దుల్ల రహీమ్ పేర్కొనడం, విపక్ష సభ్యులు వెనక్కి తగ్గకపోవడంతో మూజువాణి ఓటుకు స్పీకర్ ఆదేశించారు. 2019లో నరేంద్ర మోదీ ప్రభుత్వం 370వ అధికరణను రద్దు చేసి, జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించిన సంగతి తెలిసిందే.

# ఇంకా తేలని గడియారం గుర్తు వివాదం

## ◆36 గంటల్లోగా డిక్లరేషన్ ఇవ్వండి

## ◆అజిత్ పవార్ వర్గానికి సుప్రీం ఆదేశం

ముంబై: ఎన్‌సీపీ గుర్తు 'గడియారం' వివాదంపై అజిత్ పవార్ సారథ్యంలోని నేషలిస్ట్ కాంగ్రెస్ పార్టీకి సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు ఇచ్చింది. గడియారం గుర్తు వివాదం ఇంకా సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్నట్టుగా 36 గంటల్లోగా ప్రముఖ వార్తాపత్రికల్లో, ముఖ్యంగా మరాఠీ భాషా పత్రికల్లో డిక్లరేషన్ ఇవ్వాలని బుధవారం ఆదేశించింది.

అజిత్ పవార్ వర్గానికి గడియారం గుర్తును కేటాయించడాన్ని శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీ-ఎస్‌పీ వర్గం సుప్రీంకోర్టును ఇటీవల ఆశ్రయించింది. దీనిపై గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను కూడా అజిత్ వర్గం పాటించలేదని, అసలు వివాదంపై స్పష్టత ఇవ్వకుండానే గడియారం గుర్తు వినియోగించుకుంటున్నారని శరద్ పవార్ తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి కోర్టులో తన వాదనను వినిపించారు. అజిత్ పవార్ వర్గం తమ ఆదేశాలను పాటించడంలో జాప్యం చేస్తుండటాన్ని ధర్మాసనం సైతం గుర్తించింది. 36 గంటల్లోగా గడియారం గుర్తు వివాదం ఇంకా కోర్టు పరిశీలనలోనే ఉన్నట్టు మరాఠీ సహా ప్రముఖ పత్రికల్లో పబ్లిక్ నోటీసులు ఇవ్వాలని, వాటిని కోర్టుకు చూపించాలని ఆదేశించింది. నిర్దిష్ట షరతులకు లోబడి గడియారం గుర్తును వినియోగించుకునేందుకు అజిత్ వర్గాన్ని అనుమతిస్తూ, తదుపరి విచారణను నవంబర్ 13వ తేదీకి వాయిదా వేసింది.

### కోర్టులో సమయం వృథా చేయకుండా..

'గడియారం' గుర్తుపై విచారణ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు కూడా చేసింది. రెండు వర్గాలు (పవార్-అజిత్ వర్గం) కోర్టులో సమయం వృథా చేయకుండా ఓటర్ల మనసు గెలుసుకునేందుకు వారి ముందుకు వెళ్లాలని సూచించింది. నవంబర్ 20న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఒకే విడతలో జరుగనున్నాయి.







# కంగ్రాట్స్ మై బెస్ట్ ఫ్రెండ్!

## ◆ట్రంప్‌నకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు

న్యూఢిల్లీ: అగ్రరాజ్యం అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు ముగిశాయి. ఎన్నికల ఫలితాలు కూడా వెలువడుతున్నాయి. ఇప్పటి వరకూ వెలువడిన ఫలితాలన్నీ మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కు అనుకూలంగానే ఉన్నాయి. అధ్యక్ష ఎన్నికల్లో మొత్తం 538 ఎలక్టోరల్ ఓట్లలో మెజారిటీ మార్కు 270. తాజా ట్రెండ్ ప్రకారం.. ట్రంప్ మెజారిటీ మార్క్ 270 ఓట్లను సాధించారు. దీంతో ట్రంప్‌నకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే సమయంలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సైతం డొనాల్డ్ ట్రంప్‌నకు ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. చరిత్రాత్మక విజయం పొందిన నా మిత్రుడికి హృదయపూర్వక అభినందనలు అంటూ ట్వీట్ చేశారు.

'చరిత్రాత్మక ఎన్నికల విజయం సాధించిన నా మిత్రుడు డొనాల్డ్ ట్రంప్‌నకు హృదయపూర్వక అభినందనలు. మీ మునుపటి పదవీకాల విజయాలకు అనుగుణంగా.. భారత్ - అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి మన సంబంధాలకు పునరుజ్జీవం కల్పించడానికి నేను ఎదురుచూస్తున్నాను. ప్రజల అభివృద్ధి, శ్రేయస్సు, ప్రపంచ శాంతి, సుస్థిరత్వం కోసం కలిసి పనిచేద్దాం' అంటూ పేర్కొన్నారు. ఈ ట్వీట్‌కు గతంలో పలు వేదికల్లో ఇద్దరూ కలిసి దిగిన ఫొటోలను మోదీ పంచుకున్నారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్‌గా మారింది.

# వంద రోజుల్లోనే కొత్త మహారాష్ట్ర విజన్

## ◆ఎన్సీపీ మ్యానిఫెస్టో విడుదల

## ◆మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు

ముంబయి: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అజిత్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీ మ్యానిఫెస్టో విడుదల చేసింది. బుధవారం ఆయన బారామతిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే కొత్త మహారాష్ట్ర విజన్ ను అందజేస్తామని అజిత్ పవార్ చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, వ్యవసాయ సదుపాయాలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సునీల్ తట్కరే ముంబయిలో, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రఫుల్ పటేల్ గోండియాలో మ్యానిఫెస్టోను విడివిడిగా ఆవిష్కరించారు.



### మ్యానిఫెస్టోలోని ముఖ్య అంశాలు

గ్రామీణ ప్రాంతాల్లో 2.5 మిలియన్ల ఉద్యోగాల కల్పన
లడ్కీ బహిన్ పథకం నెలవారీ సాయం రూ.1,500 నుంచి రూ.2,100కు పెంపు
వరి రైతులకు హెక్టారుకు 25వేల బోనస్
వృద్ధాప్య పింఛను రూ.1,500 నుంచి రూ.2,100కు పెంపు
షెట్కారీ సన్మాన్ నిధి పథకం ద్వారా రైతులకు ఏడాదికి రూ.15 వేలు.
గ్రామీణ ప్రాంతాల్లో 45 వేలు 'పనంద్' రోడ్ల నిర్మాణం
అంగన్వాడీలు, ఆశా వర్కర్లకు రూ.15 వేలు నెలవారీ జీతం
సౌర, పునరుత్పాదక ఇంధనానికి ప్రాధాన్యత, విద్యుత్తు బిల్లుల్లో 30 శాతం తగ్గింపు.

ఇదిలావుండగా 288 మంది శాసనసభ స్థానాలు కలిగిన మహారాష్ట్రలో నవంబరు 20న ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. నవంబరు 23న ఫలితాలను ప్రకటించనున్నారు.

# ఎల్ఎంవి లైసెన్స్‌తో రవాణా వాహనాలు నడపొచ్చు

## ◆సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కీలక తీర్పునిచ్చింది. ఎల్ఎంవి (లైట్ మోటార్ వెహికల్) డ్రైవింగ్ లైసెన్స్‌తో 7500 కిలోల లోపు ట్రాన్స్‌పోర్టు వాహనాలు కూడా నడపొచ్చు అని తీర్పులో వెల్లడించింది. సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ పంకజ్ మిథాల్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పును వెల్లడించాయి. 7500 కిలోల కంటే తక్కువ బరువు ఉన్న రవాణా వాహనాన్ని నడిపేందుకు ప్రత్యేక డ్రైవింగ్ లైసెన్స్ అక్కర్లేదని తీర్పునిచ్చింది.

లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ ఉన్నవారు రవాణా వాహనం నడపడమే ప్రమాదాలకు ప్రధాన కారణమనే వాదనను సుప్రీం తోసిపుచ్చింది. ఇందుకు సంబంధించి ఎలాంటి స్పష్టమైన డేటా తమ వద్ద లేదని తెలిపింది. 7,500 కిలోలకు పైగా ఉన్న రవాణా వాహనాలను నడిపేందుకు ప్రత్యేక అనుమతి అవసరం లేదని అత్యున్నత ధర్మాసనం స్పష్టం చేసింది.

ఈ మేరకు ఎల్ఎంవీ కేటగిరీలోని ట్రాన్స్‌పోర్టు వాహనాలను డ్రైవ్ చేసేవారికి ప్రత్యేకంగా ఎలాంటి లైసెన్సు అవసరం లేదు.

# 'పీఎం-విద్యాలక్ష్మి'కి కేంద్ర క్యాబినెట్ ఆమోదం

## ◆రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పీఎం-విద్యాలక్ష్మి పథకానికి కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పీఎం-విద్యాలక్ష్మి పథకం ద్వారా దేశవ్యాప్తంగా 860 విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు కేంద్రం హామీతో రూ.7.50 లక్షల వరకు రుణం లభించనుంది. రుణంలో 75 శాతం వరకు బ్యాంకులకు కేంద్ర ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వనుంది. క్యాబినెట్ నిర్ణయాలను రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడిస్తూ.. ఎఫ్‌సీఐలో మూలధన అవసరాలకు రూ.10,700 కోట్లను కేటాయించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు.



పీఎం విద్యాలక్ష్మి పథకం ద్వారా ఏటా 22 లక్షల మందికి పైగా ప్రతిభావంతులైన విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. ఇది సరళమైన, పారదర్శకమైన స్టూడెంట్ ఫ్రెండ్లీ ప్రక్రియ అని మంత్రి తెలిపారు. రూ.8లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్నవారికి ఈ పథకం వర్తింపజేయనున్నారు. రూ.10 లక్షల వరకు రుణాలపై రూ.3 శాతం వడ్డీ రాయితీ కల్పించనున్నారు. ఏదైనా ప్రభుత్వ స్కాలర్‌షిప్ లబ్ధిదారులు ఈ పథకానికి అనర్హులు. విద్యార్థులు పీఎం విద్యాలక్ష్మి వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.